ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -215 పేజీలు - 08 వెల - 04/-

బుధవారం 4 జూన్ 2025

# త్వరలో ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్

## ☛ పోర్టులు, ఎయిర్‌పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సీఎం సమీక్ష

**అమరావతి, జూన్ 03, ఆంధ్ర ప్రగతి:** త్వరలో ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయను న్నట్టు సిఎం చంద్రబాబునాయుడు చెప్పారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను రాష్ట్ర సంపదగా తీర్చిదిద్దాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సీఎం సమీక్ష నిర్వహించారు. వచ్చే ఏడాదికి 4 పోర్టులు, 4 హార్బర్లు సిద్ధం చేయాలని అధికారు లకు దిశానిర్దేశర చేశారు. తొలిదశలో అమరా వతి, కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం ఎయిర్‌పోర్టుల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. పీపీపీ విధానంలో రద్దీ మేరకు రాష్ట్ర రహదారుల విస్తరణ చేపట్టనున్నట్టు- వివరించారు. హైవేల తో అన్ని రాష్ట్ర రహదారులను అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. మచిలీపట్నం పోర్టు మొదటి దశ పనులు 43.25 శాతం పూర్తికాగా.. వచ్చే ఏడాది నవంబర్ నాటికి మొత్తం పనులు పూర్తికాను న్నాయని అధికారులు సీఎంకు వివరించారు. రామాయపట్నం పోర్టు మొదటి దశ పనులు 63.89 శాతం, మూలపేట పోర్టు మొదటిదశ పనులు 46.59 శాతం, కాకినాడ గేట్‌వే పోర్టు పనులు 29.92 శాతం పూర్తయ్యాయని తెలిపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మొదటి దశ నిర్మాణం పనులు 97.72 శాతం, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ మొదటి దశ



పనులు 81.17 శాతం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 69.20 శాతం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 78.94 శాతం పూర్తయ్యాయని అధికారులకు సీఎంకు తెలిపారు.



## నేరగాళ్లకు మాజీ సీఎం పరామర్శలా..?

### దిగజారుడు ఓట్ల రాజకీయానికి పరాకాష్ఠ

### ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

**అమరావతి జూన్ 03, ఆంధ్ర ప్రగతి:** నేరగాళ్లకు మాజీ సీఎం జగన్ పరామర్శ.. దిగజారుడు ఓట్ల రాజకీయానికి పరాకాష్ఠ అని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. గంజాయి బ్యాచ్ సానుభూతి పలకడం బాధాకరమని రఘురామకృష్ణంరాజు అన్నారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో ఆత్మహత్యలే తప్ప హత్యలుండవు అనే సామెత జగన్‌లాంటి వారిని చూసే వచ్చింది. గంజాయి బ్యాచ్‌ను పరామర్శించి రాజకీయంగా ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులపై హత్యాయత్నం చేసిన నిందితులకు జగన్ అండదండలా? నాడు ఎంపీగా ఉన్నప్పుడు అప్పటి అధికారి సునీల్‌కుమార్‌తో నన్ను కస్టడీలో కొట్టించింది జగనే. ఆయన్ను చూసి జాలిపడటం తప్ప ఇంకేమీ

## ఏపిలో యోగాంధ్ర కార్యక్రమాలు భేష్



**న్యూఢిల్లీ, జూన్ 03, ఆంధ్ర ప్రగతి:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నిపురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో యోగా కార్యక్రమాలు జరుగుతున్న తీరుపట్టల ప్రధాని మోడీ ఆనందం వ్యక్తం చేశారు. నెలరోజులపాటు చేపడతున్న కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నా యని అన్నారు. యోగాంధ్ర దినోత్సవం పట్ల ప్రజల్లో ఉత్సాహాన్ని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీఅన్నారు. యోగాంధ్ర 2025 పేరిట యోగాకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ఆంధప్రదేశ్ ప్రజలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. జూన్ 21న ఏపీలో యోగా దినోత్సవం జరుపుకొనేందుకు ఎంతో ఆసక్తితో ఎదురుచూ స్తున్నట్లు- పేర్కొన్నారు. మిగతాది 2లో...

## ట్రంప్ ఫోన్‌తో మోడీ సరెండర్

### ఆపరేషన్ సిందూర్‌కు అందుకే బ్రేక్

### రాహుల్ గాంధీ విమర్శలు



**భోపాల్, జూన్ 03, ఆంధ్ర ప్రగతి:** ఆపరేషన్ సిందూర్ కొనసాగుతున్న సమయంలో కాల్పుల విరమణకు అంగీకరించడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్‌కాల్ రాగానే ప్రధాని నరేంద్ర మోదీ సరెండర్ అయ్యారని ఆరోపించారు. భోపాల్‌లోని రవీంద్ర భవన్‌లో మంగళవారం నాడు జరిగిన పార్టీ సదస్సులో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, బీజేపీ-ఆర్ఎస్ఎస్ నేతలపై చిన్న ఒత్తిడి వచ్చినా సరే భయపడి పారిపోతారని మిగతాది 2లో...



## వ్యవస్థలన్నీ నిర్వీర్యం

- కూటమి ప్రభుత్వాన్ని త్వరగా సాగనంపాలి
- నడిరోడ్డులో యువకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగం
- చంద్రబాబు రాకతో సంక్షేమం ఆగిపోయింది
- రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రం అదుపు తప్పింది
- వెన్నుపోటు దినోత్సవంలో నిరసించండి
- తెనాలి పర్యటనలో వైసిపి అధినేత జగన్ విమర్శలు

**గుంటూరు, జూన్ 03, ఆంధ్ర ప్రగతి:** కూటమి పాలనలో రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని.. లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందని.. ఇలాంటి ప్రభుత్వం కొనసాగడం ఎంతమాత్రం మంచిది కాదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెనాలిలో పర్యటించిన ఆయన.. నడిరోడ్డులో యువకులపై పోలీసుల థర్డ్ డిగ్రీ దాష్టికాన్ని ఖండిస్తూ మీడియాతో మాట్లాడారు. మిగతాది 2లో...

## బనకచర్లను ఒప్పుకోం

- అడ్డుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం
- మా అభ్యంతరాలను కేంద్రానికి తెలియజేశాం
- కేంద్ర మంత్రిసి.ఆర్ పాటిల్‌కు ఫిర్యాదు చేశాం
- బనకచర్లనుఅడ్డుకోవాలని కోరాం
- గోదావరి రివర్ మేనేజ్‌మెంట్‌బోర్డుకు,
- కేంద్ర మంత్రికి లేఖలు రాశాం
- మీడియాతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**న్యూఢిల్లీ, జూన్ 03, ఆంధ్ర ప్రగతి:**
ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సముద్రంలో కలిసే నీళ్లే వాడుకుంటామని ఏపీ నేతలు ఎలా చెబుతారని ప్రశ్నించారు. మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ బనకచర్లను అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. సముద్రంలోకి వృథాగా పోయే జలాలనే వినియోగిస్తామని ఆంధ్రప్రదేశ్ నేతలు పేర్కొనడం విస్మయం కలిగిస్తోందన్నారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్‌కు లేఖలు రాశామని, ఈ అంశంపై కేంద్ర మంత్రితో నేరుగా మాట్లాడి ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరినట్లు వివరించారు. తమ అభ్యంతరాలను కేంద్రానికి తెలియచేశామని, ఈ అంశంపై సరైన సమయంలో స్పందిస్తామని ఉత్తమ్ తెలిపారు. మిగతాది 2లో...



# కల నెరవేరింది

### 18 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత

## ఆర్సీబీ తొలి ఐపీఎల్ టైటిల్ కైవసం

- అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్‌లో పంజాబ్ సూపర్ కింగ్స్‌పై ఉత్కంఠ విజయం
- బెంగళూరు నగరం మొత్తం హెూరెత్తిన విజయోత్సవాలు, రోడ్లపైకి అభిమానులు
- కోహ్లీ 18 ఏళ్ల అంకితభావమే ఈ విజయానికి కారణమన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య
- సంబరాల నేపథ్యంలో బెంగళూరులో కట్టుదిట్టమైన పోలీసు భద్రత



**జూన్ 03, ఆంధ్ర ప్రగతి:**

ఈ సాల కప్ నమదే (ఈ ఏడాది కప్ మనదే) అంటూ... 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు తొలిసారి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ట్రోఫీని కైవసం చేసుకుంది. అహ్మదాబాద్‌లో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పంజాబ్ సూపర్ కింగ్స్‌పై అద్భుత విజయం సాధించి, బెంగళూరు నగరానికి చిరస్మరణీయమైన రాత్రిని అందించింది. ఈ చారిత్రక విజయంతో నగరం మొత్తం సంబరాల్లో మునిగిపోయింది. మ్యాచ్ ముగిసిన వెంటనే బెంగళూరు వీధులు జనసంద్రంగా మారాయి. అభిమానులు జెండాలు ఊపుతూ, బాణాసంచా కాలుస్తూ, నినాదాలతో హెూరెత్తించారు. ఇందిరానగర్ నుండి కోరమంగళ వరకు, ఎంజీ రోడ్ నుండి బ్రిగేడ్ రోడ్ వరకు నగరం మొత్తం ఎరుపు, బంగారు వర్ణాలతో నిండిపోయింది. అభిమానుల పాటలు, నృత్యాలు, కేరింతలతో రాత్రంతా సందడి వాతావరణం నెలకొంది. చర్చ్ స్ట్రీట్‌లోని పబ్‌లు, కేఫ్‌ల వద్ద వందలాది మంది అభిమానులు గుమిగూడి మ్యాచ్ చివరి క్షణాలను వీక్షించారు. ఆర్సీబీ గెలుపు ఖరారైన వెంటనే, అపరిచితులు సైతం ఆనందంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. యువకులు బాణాసంచా కాల్చగా, "ఈ సాలా కప్ నమదే!" నినాదాలు మిన్నంటాయి. 7లో

# బనకచర్లను ఒప్పుకోం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే ఇటువంటి ప్రాజెక్టుల విషయంలో ఏ మాత్రం రాజీపడేది లేదని ఆయన స్పష్టం చేశారు.బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్ర ఆర్థిక శాఖ ప్రత్యేక సమావేశం : కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ పోలవరం-బనకచర్ల రివర్ లింక్ ప్రాజెక్ట్ డీపీఆర్ పై చర్చించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. రూ.81,000 కోట్లతో నిర్మించాలని ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తోంది. ఈ సమావేశంలో పోలవరం- బనకచర్ల రివర్ లింక్ ప్రాజెక్ట్ డీపీఆర్( డిటేయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్)పై చర్చించినట్లు సమాచారం. రూ.81 వేల కోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టడానికి ఏపీ ప్రయత్నం ప్రయత్నాలు చేస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రాజెక్ట్‌తో కలిగి ప్రయోజనాలు వివరిస్తూ డీపీఆర్ రూపొందించారు. ఈ నేపథ్యంలో జూన్ 2న న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులతో ఏపీ జలవనరులు శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీ ప్రభుత్వ నీటి సలహాదారు వెంకటేశ్వరరావు సమావేశమయ్యారు.

ఈ ప్రాజెక్ట్ నిర్మాణం గురించి కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శికి ఏపీ అధికారులు సోదాహరణగా వివరించారు. ఈ సందర్భంగా ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు ఏమైనా నష్టం జరిగే అవకాశముందా అనే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు ఏపీ అధికారులను ప్రశ్నించగా వాటికి సైతం రాష్ట్ర అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చినట్లు తెలుస్తుంది. అయితే బనకచర్ల ప్రాజెక్ట్‌ను తెలంగాణ వ్యతిరేకిస్తోంది. ఈ అంశాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరోవైపు సముద్రంలోకి వెళ్లే జలాలు మాత్రమే వినియోగించుకుని జనకచర్ల రూపొందించామని ఏపీ ప్రభుత్వం చెబుతోంది. ఇందులో తెలంగాణకు అభ్యంతరమేంటని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సైతం ప్రశ్నించారు. గతంలో ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భేటీలో సీఎం చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఇప్పుడు కేంద్ర ఆర్థిక శాఖ కోరిన పూర్తి వివరాలను ఏపీ నీటి పారుదల, ఆర్థిక శాఖల అధికారులు సమర్పించినట్లు తెలిసింది.

# ఎపిలో యోగాంధ్ర కార్యక్రమాలు భేష్

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 21న విశాఖలో 5 లక్షల మందితో ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. విశాఖలో జరిగే యోగా ఈవెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనను న్నారు. అందరూ యోగా దినోత్సవంలో పాల్గొనాలని, యోగాను నిత్య జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగాంధ్ర లో భాగంగా చిత్తూరు సమీపంలోని పులిగుండుట్విన్‌హిల్స్‌లో దాదాపు 2వేల మందికి పైగా ఔత్సాహికులు యోగాసనాలు వేస్తున్న ఫొటోలను కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ 'ఎక్స్'లో షేర్ చేయగా.. ఆ ట్వీట్‌ను ప్రధాని రీట్వీట్ చేశారు. జీవన శైలిలో భాగమయ్యేలా యోగాను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విషయం తెలిసిందే. మే 21 నుంచి జూన్ 21 వరకు కూటమి ప్రభుత్వం గ్రామ, మండల, నియోజ కవర్గ స్థాయిలో యోగాపై అవగాహన కల్పిస్తోంది. కనీసం 2 కోట్ల మందికి తక్కువ కాకుండా పాల్గొనా లన్నది సంకల్పంగా పెట్టుకోగా.. 10 లక్షల మందికి పైగా యోగా సర్టిఫికెట్లు- ఇవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకుంది.

# టంప్ ఫోన్‌తో మోడీ సరెండర్

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ట్రంప్ అక్కడి నుంచి ఫోన్ చేసి చెప్పగానే మోడీ సరెండర్ అయ్యారని విమర్శించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1971 సంక్షోభంలో నిర్ణయాత్మక వైఖరి ప్రదర్శించారని రాహుల్ గుర్తుచేశారు. 1971లో అమెరికా సెవెన్త్ ఫ్లీట్ వచ్చినప్పుడు, నేను ఏమి చేయాలో అదే చేస్తానంటూ ఇందిరాగాంధీ చెప్పారని అన్నారు. కానీ ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలకు మాత్రం ఇండిపెండెన్స్ సమయం నుంచీ లొంగుబాటు- లేఖలు రాయడం అలవాటని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ లొంగిపోదని చెప్పారు. గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్ లొంగిపోయే వ్యక్తులు కారని, సూపర్ పవర్‌లను ఎదిరించి పోరాటం చేశారని చెప్పుకొచ్చారు. కాగా, ఇండియా-పాక్ మధ్య కాల్పుల విరమణకు ఎవరూ మధ్యవర్తిత్వం చేయలేదని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇటీ-వల వివరణ ఇచ్చింది. ఇరుదేశాల డీజీఎంఏలు నేరుగా చర్చించి కాల్పుల విరమణకు నిర్ణయించినట్టు- ఎంఈఏ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన మే 7 నుంచి.. కాల్పుల విరమణ జరిగిన మే 10 వరకూ కేవలం మిలటరీ పరిస్థితిపైనే భారత్, అమెరికా మధ్య సంభాషణలు జరిగాయే కానీ, సుంకాల అశం ఎక్కడా ప్రస్తావనకు రాలేదన్నారు.

# నేడు ఎపి కేబినేట్ భేటీ

**అమరావతి,జూన్ 03, ఆంధ్ర ప్రగతి:** : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ భేటీ కానుంది. బుధవారం ఉదయం 11. 00 గంటలకు వెలగపూడిలోని సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ భేటీలో రాజధాని అమరావతి నిర్మాణంపై చర్చించనున్నారు. అలాగే అమరావతిలో నిర్మించే జీఏడీ టవర్ టెండర్లకు కేబినెట్ అమోదం తెలపనుంది. ఇక హెచ్‌వోడీ నాలుగు టవర్ల టెండర్లకు సైతం కేబినెట్ అమోదించనుందనితెలుస్తుంది. మరోవైపు రాజధాని అమరావతి ప్రాంతంలో రెండో దశలో 44 వేల ఎకరాల భూమి సేకరించే అంశాన్ని సైతం చర్చించి.. ఆమోదించే అవకాశమున్నట్లు సమాచారం. అలాగే అమరావతిలో 5 వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి కేబినెట్ అమోదం తెలపనుంది. 2,500 ఎకరాల్లో అంతర్జాతీయ స్పోర్ట్స్ కాంపెక్స్, మరో 2,500 ఎకరాల్లో స్మార్ట్ ఇండస్ట్రీ హబ్ నిర్మాణం చేపట్టనున్నట్లు- తెలుస్తోంది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి అమోదం తెలపనుంది. ఇక తల్లికి వందనంపై కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉంది. అదే విధంగా కూటమి సర్కార్ ఏడాది పాలనపై ప్రత్యేక చర్చ జరగనుంది. జూన్ 21వ తేదీన వైజాగ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా డేపై చర్చించనున్నారు. జూన్ 5వ తేదీన జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమంపై చర్చించనున్నారు. ఇంకోవైపు 48వ సీఆర్డీఏ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో రాజధాని అమరావతికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. అదీకాక రాజధాని అమరావతికి మరికొన్ని వేల ఎకరాల భూమి అవసరమవుతుందని ప్రభుత్వం భావిస్తుంది. ఆ క్రమంలో ఆ సేకరణకు సంబంధించిన అంశాలు ఈ కేబినెట్ భేటీ-లో ఒక కొలిక్కి వచ్చే అవకాశముందని తెలుస్తోంది.

# జగన్ రాక్షస పాలనకు తెరదించి ఏడాది

**● మంత్రి అనగాని సత్యప్రసాద్**

**అమరావతి,జూన్ 03, ఆంధ్ర ప్రగతి:** : వెన్నుపోటు దినమంటూ జగన్ కొత్త నాటకానికి తెరలేపారని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. ఐదేళ్లు ప్రజలకు చేసిన మోసానికి జగన్ ప్రాయశ్చిత్తం చేసుకోవాలని సూచించారు. జూన్ 4న వైకాపా నేతలు పశ్చాత్తాప దినంగా నిర్వహించుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వ పాలన చూసి ఆ పార్టీ నేతలు ఓర్వలేకపోతున్నారు. అలవాటు ప్రకారం అసత్యాల ప్రచారమే పనిగా పెట్టుకున్నారు. తల్లి, చెల్లిని వెన్నుపోటు పొడిచిన జగన్‌ను ప్రజలు నమ్మట్లేదు. ఇదే వైఖరి కొనసాగితే వైకాపా పరిస్థితి గుండుసున్నానేనని అనగాని విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనకు సరిగ్గా ఏడాది క్రితం ప్రజలు ముగింపు పలికారని మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు. ప్రజలను వేధించిన సైకో నేతకు చాచి కొట్టినట్లు బుద్ధి చెప్పారని అన్నారు. ఐదేళ్ల పాటు- ప్రజలకు చేసిన మోసానికి జగన్మోహన్‌రెడ్డి నిజానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని.. కానీ వెన్నుపోటు- దినమంటూ డ్రామాలు ఆడుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎద్దేవా చేశారు. మంగళవారం అమరావతిలో మీడియాతో మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్, వైసీపీ నేతలపై షాకింగ్ కామెంట్స్ చేశారు.

# రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిరసనల్లో పాల్గొనాలి అని జగన్ పిలుపు ఇచ్చారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రం అదుపు తప్పిందని.. పోలీస్ వ్యవస్థ దిగజారిపోయిందని జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. పోలీసుల చేతిలో హింసకు గురైన యువకుల కుటుంబాలను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంతో చంద్రబాబు పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. ప్రశ్నించే గొంతులను అణగ దొక్కుతున్నారు. మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారు. రెడ్‌బుక్‌తో వేధించి హింసిస్తున్నారు. పోలీస్ వ్యవస్థ వికృత రూపానికి తెనాలి ఘటనే సాక్ష్యం అన్నారు. తెనాలి పోలీసుల చేతిలో దళితులు, మైనారిటీల ముగ్గురు పిల్లలు దెబ్బలు తిన్నారు. రాకేష్ హైదరాబాద్‌లో జొమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆ యువకుడు తెనాలిలోనే ఉండడం లేదు. పాత కేసులో వాయిదా కోసం తెనాలికి వచ్చాడు. రాకేష్‌ను చూడడానికి అతని స్నేహితులు వచ్చారు. వాళ్లు కూడా మంగళగిరి నుంచి వచ్చారు. జాన్ విక్టర్ జూనియర్ అడ్వకేట్. బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం కూడా ఉంది. ఐతా నగర్‌లో సివిల్ డ్రెస్‌లో ఉన్న కానిస్టేబుల్ ఎవరితో గోవడ పడుతుంటే ఈ యువకులు అడ్డుకున్నారు. గొడవ పడుతున్న కానిస్టేబుల్‌ను వీళ్లు ప్రశ్నించారు. కేవలం కానిస్టేబుల్‌ను ప్రశ్నించడం వీళు చేసిన తప్పా?. ఏప్రిల్ 24న కానిస్టేబుల్‌ను యువకులు ప్రశ్నించారు. 25న పోలీసులు మంగళగిరి వెళ్లి జాన్ విక్టర్, కరీముల్లాను కొట్టుకుంటూ తీసుకొచ్చారు. తెనాలి పీఎస్‌లో కూడా పడేసి కొట్టారు.




ఏప్రిల్ 26న ఐతానగర్‌లో నడిరోడ్డు మీద పడేసి ముగ్గురిని చితకబాదారు. కొట్టొద్దని వేడుకున్నా పోలీసులు వదల్లేదు. యువకుల పరువు ప్రతిష్టలతో ఆడుకుంటూ పడేసికొట్టారు. విక్టర్ జేబులో కత్తి పోలీసులే పెట్టారు. ఈ వ్యవహారంలో తెనాలి టూటౌన్ సీఐ, మరో పీఎస్ సీఐ కూడా ఉన్నారు. ఇద్దరూ వీఆర్వో సమక్షంలో పంచనామా రాసుకున్నారు. అరెస్ట్ చేసిన వాళ్లను సకాలంలో కోర్టు ముందు ప్రవేశపెట్టలేదు. ఇది చట్టాన్ని ఉల్లంఘించడం కాదా అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఈ ఘటన జరిగిన తర్వాతే ముగ్గురి మీద రౌడీషీట్ తెరిచారు. పోలీసులు ఎంత దుర్మార్గంగా వ్యవహరించారనేది అర్థమవుతోంది. పోలీసులే తీర్పులు ఇస్తున్నారు. జరుగుతున్నది అన్యాయం అని తెలిసి కూడా.. ఎల్లో మీడియా బ్యాచ్ దారుణంగా కథనాలు ఇచ్చింది. గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్లంటూ పరువు తీస్తూ కథనాలు ఇచ్చా యి. కేసులు ఎవరి మీదా అయినా ఉండొచ్చు. ఆ వ్యహారాన్ని కోర్టులు చూసుకుంటాయి. చంద్రబాబుపై 24 కేసులున్నాయని నడిరోడ్డు మీదకు తీసుకొచ్చి తన్నడం ధర్మమేనా?. పోలీసులే చట్టాన్ని ఉల్లంఘిస్తారా?. ఇలా చేసే నైతికత పోలీసులకు ఉందా? ఇది ధర్మమేనా?. పరువు, ప్రతిష్టలు తీసే హక్కు పోసులకు ఉందా?. నడిరోడ్డుపై కొట్టే హక్కు పోలీసులకు ఎవరిచ్చారు? పోయిన ఆ కుటుంబాల పరువును ఎవరు తీసుకొస్తారని జగన్ ప్ర శ్నించారు. జగన్ వెంట అంబటి రాంబాబు తదితరులు ఉన్నారు.

# మైనారిటీల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

## కేంద్ర పథకాల సమర్థ వినియోగానికి కార్యాచరణ- మంత్రి ఫరూక్

### పీఎం వికాస్, పీఎంజేవీకే, ఎన్ఎండిఎఫ్ సి పథకాలపై మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమీక్ష

**అమరావతి జూన్ 03, ఆంధ్ర ప్రగతి:** రాష్ట్రంలోని మైనారిటీల ఆర్థిక స్వావలంబన, సామాజిక స్థితిగతులను మెరుగుపరచడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మైనారిటీ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి కార్యాచరణ బద్ధంగా ప్రణాళిక అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.మంగళవారం వెలగపూడి సచివాలయంలోని మూడవ బ్లాక్ లో మైనారిటీ మంత్రిత్వ శాఖ పేషీ కార్యాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కేంద్ర పథకాలపై మంత్రి ఫరూక్ సమీక్ష చేశారు. ప్రధానమంత్రి విరాసత్ క సంవర్ధన్ ( పీఎం వికాస్ ), ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం ( పీఎంజేవీకే ), జాతీయ మైనారిటీల అభివృద్ధి ఆర్థిక సంస్థ ( ఎన్ ఎం డి ఎఫ్ సి ) పథకాల ద్వారా రాష్ట్రానికి వచ్చే నిధుల వినియోగం, అందుకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై మంత్రి ఫరూక్ సుదీర్ఘంగా సమీక్ష చేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, వక్ఫ్ సర్వే కమిషనర్ షిరీన్ బేగం, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి యాకుబ్ భాష, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎం.డి ఏ. శేఖర్, వక్ఫ్ బోర్డు సీఈవో మహమ్మద్ అలీ, మైనారిటీ సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీ సుధాకర్ రావు తదితరులతో కేంద్ర మైనారిటీ మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న పథకాలపై, పురోగతికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి ఫరూక్ సమీక్షించారు. ఈ సందర్భంగా



మంత్రి ఫరూక్ మాట్లాడుతూ స్కాలర్షిప్ లు, పీఎం వికాస్, పీఎంజేవీకే, ఎన్ ఎం డి ఎఫ్ సి పథకాల ద్వారా మైనారిటీలలో ఆర్థిక స్వావల%శీ%బన సాధించడానికి, వృత్తి నైపుణ్య అభివృద్ధితో ఉపాధి అవకాశాలను పెంపొందించడం కోసం, విద్యను మరింత అందుబాటులోకి మైనారిటీల చెంతకు చేర్చడం ద్వారా సామాజిక స్థితిగతులలో ఉన్నత స్థాయిలో మెరుగుపరిచేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, కేంద్ర మైనారిటీ పథకాలను కూడా సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా మైనారిటీ వర్గాల సంక్షేమానికి కార్యాచరణ బద్దంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. మైనారిటీ మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న విభాగాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మైనారిటీ సంక్షేమ పథకాల అమలు కోసం, కేంద్రం నిధులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు సమన్వయంతో ఆయా విభాగాలు కలిసి పనిచేయాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు. మైనార్టీల ఆర్థిక ఉన్నతి కోసం, స్వయం ఉపాధి కల్పన కోసం నైపుణ్య అభివృద్ధి శిక్షణతో పాటు, సరళీకృతమైన విధానాలతో రుణాలను బ్యాంకుల ద్వారా అందించడం, రాయితీకి సంబంధించిన అంశాలపై అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు.

# నేరగాళ్లకు మాజీ సీఎం జగన్ పరామర్శలా..?

(మొదటి పేజీ తరువాయి)

చేయలేం అని రఘురామ ఎద్దేవా చేశారు. అరాచకాలు చేసినవారికి జగన్ మద్దతివ్వడం దారుణమని చెప్పారు. డాక్టర్ సుధాకర్‌ను జగన్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. తనకు ఓటేయని ప్రజలపై వైసీపీ వెన్నుపోటు- దినోత్సవం చేస్తోందని ధ్వజమెత్తారు. హెల్త్ కార్డ్ కోసం కొంతమంది నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చి మరి తెల్లరేషన్ కార్డు తీసుకుంటున్నారని.. అలా చేయొద్దని రఘురామకృష్ణంరాజు కోరారు. హెల్త్ కార్డ్ ఉన్న ప్రతి పౌరుడికి రూ. 25 లక్షలు కవరయ్యేలా చూడాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోందని రఘురామకృష్ణంరాజు చెప్పారు. ముందు తమ కమిటీ రిపోర్ట్‌ని అసెంబ్లీ స్పీకర్‌కు ఇస్తామని వెల్లడించారు. అవసరం లేకుండా కొంతమంది రేషన్ తీసుకోవడం వల్లే బియ్యం స్మగ్లింగ్ జరుగుతుందని అన్నారు. ఇప్పుడు కోటి 40 లక్షలు మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని వివరించారు. ఏపీలో మొత్తం కోటి 70 లక్షల కుటుంబాల్లో.. కోటి 40 లక్షలు బీపీఎల్ కిందే ఉన్నారనే విషయాన్ని నమ్మడం కష్టమని అన్నారు. రేషన్ అవసరం లేని వారు స్వచ్ఛందంగా ముందుకు వస్తే వారికి హెల్త్‌కార్డ్‌లో భాగంగా రూ. 25 లక్షలు కవరయ్యేలా చేస్తామని వివరించారు రఘురామకృష్ణంరాజు.ఏపీ ప్రభుత్వం రేషన్‌కు రూ.5, 100 కోట్లు- ఇస్తోందని.. ఇందులో రూ. 2000 కోట్లు- రేషన్‌లో మిగిలితే ఆ మొత్తం విద్యాశాఖకు ఖర్చు పెడితే నాణ్యమైన విద్యా లభిస్తుందని రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించారు. హెల్త్ కార్డ్, రేషన్ కార్డు, పెన్షన్ కార్డులను వేర్వేరుగా ఇస్తే ఎలా ఉంటుందనే విషయాన్ని తమ కమిటీ- ఆలోచించిందని చెప్పారు. ఈ విషయాన్ని అసెంబ్లీ స్పీకర్ ద్వారా ఏపీ ప్రభుత్వానికి అందించాలని నిర్ణయించామని తెలిపారు. 15 రోజులకు ఒకసారి తమ కమిటీ సమావేశం అవ్వాలని నిర్ణయించామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో పిటీ-షన్ కమిటీ- ఒక్కసారి కూడా సమావేశం కాలేదని అన్నారు. రేషన్ అవసరం లేకపోతే ఆ మేరకు నగదు బదిలీపై చర్చిస్తున్నామని తెలిపారు. కోటి 46 లక్షల రేషన్ కార్డులకు నగదు ఇస్తే ధాన్యం ఎవరు కొంటారని ప్రశ్నించారు. బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇస్తే ధాన్యం కొనరా అని అడిగారు. రేషన్ షాప్‌లో రేషన్ మాత్రమే కాకుండా అన్ని ప్రొవిజన్‌లు ఉండేలా చూసే ఆలోచన కూడా ఉందని అన్నారు. ఇప్పుడు అవసరం ఉన్న వారికి రేషన్ ఇంటి డెలివరీ అవుతుందని రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు.

# మెట్ల మార్గంలో టోకెన్ సెంటర్ మార్పు

**- అలిపిరి భూదేవి సెంటర్‌కు మార్చిన టిటిడి**

**తిరుమల, జూన్ 03, ఆంధ్ర ప్రగతి:** ,:కలియుగ ప్రత్యక్షదైవమైన తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి నిత్యం వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. కొంతమంది భక్తులు నడకమార్గం ద్వారా తిరుమలకు చేరుకుని శ్రీవారి దర్శనం చేసుకుంటూ ఉంటారు. అలిపిరి నడక మార్గం నుంచే కాకుండా శ్రీవారి మెట్టు నుంచి కూడా తిరుమలకు చేరుకునే అవకాశం ఉంది. అలిపిరి నడకమార్గంతో పోలిస్తే శ్రీవారి మెట్టు- మార్గం మెట్లు- తక్కువగా ఉండటంతో కొంతమంది భక్తులు అక్కడి నుంచి తిరుమలకు వెళ్లడానికి ప్రాధాన్యం ఇస్తుంటారు.ఇక తిరుమలకు కాలినడకన వెళ్లేవారికి టీటీడీ దివ్య దర్శనం టోకెన్లు జారీ చేస్తుంది. అలిపిరి, శ్రీవారి మెట్టు- మార్గాల వద్ద శ్రీవారి దివ్య దర్శనం టైమ్ స్లాట్ టోకెన్లు జారీ చేస్తోంది. అయితే.. శ్రీవారి మెట్ల వద్ద నడక మార్గంలో జారి చేసే టోకెన్ల కౌంటర్ ని తాత్కాలికంగా మార్పు చేసినట్లు టీటీడీ పేర్కొంది. శు క్రవారం నుంచి అలిపిరి వద్ద ఉన్న భూ దేవి కాంప్లెక్స్ వద్ద దర్శన టోకెన్లు జారీ చేయాలని నిర్ణయిం చింది.

# 5వ తేదీన మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టండి

**-టెలికాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 03:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5వ తేదీన పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమంపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, ఆర్డీఓలు, డిప్యూటీ సీఈఓ, మున్సిపల్ ఇంజనీర్లు, ఎంపిడిఓలు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపిడిఓలు, స్పెషల్ ఆఫీసర్లను కలెక్టర్ ఆదేశించారు. 489 గ్రామ పంచాయతీల్లో ప్రతి గ్రామ పంచాయతీలో 200 నుండి 250 మొక్కల చొప్పున లక్ష మొక్కలను నాటాలన్నారు. ఐదు మున్సిపాలిటీల పరిధిల్లో 30వేల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి పాఠశాలకు 30 మొక్కల చొప్పున 1300 ప్రభుత్వ పాఠశాలల్లో 39 వేల మొక్కలను నాటేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. 21 ప్రభుత్వ కళాశాలల ఆవరణంలో 50 మొక్కల చొప్పున వెయ్యి మొక్కలు నాటించేందుకు చర్యలు తీసుకోవాలని డీవీఈఓ ను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా సాంఘిక సంక్షేమం, మైనార్టీ సంక్షేమం, బీసీ సంక్షేమం, గిరిజన సంక్షేమ, రెసిడెన్షియల్ వసతి గృహాల్లో 5వేల మొక్కలు నాటేలా సంక్షేమ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ, మైనింగ్ శాఖలలో 15 వేల మొక్కలు నాటేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో 30 వేల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పిడిని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయం, హార్టికల్చర్, ఇరిగేషన్ తదితర అనుబంధ రంగాల్లో కెనాల్ బండ్స్, పొలాల గట్ల మీద మొక్కలు పెంచేలా చూడాలన్నారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో 40 వేల మొక్కలు నాటేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ డిఎఫ్ఓ లను ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా హౌసింగ్ కాలనీలలో ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటి 20వేల లక్ష్యాన్ని పూర్తి చేయాలని హౌసింగ్ పిడిని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో 10 వేల మొక్కలు నాటాలన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, నేషనల్ హైవే పరిధిలో ఉన్న వసతి గృహాల్లో 5 వేల మొక్కలు నాటాలన్నారు. అదే విధంగా అన్ని ప్రైవేటు పాఠశాలలు, కళాశాల ఆవరణలలో 75 వేల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఫ్రెండ్స్ ఫర్ సేవా సమితి ఆధ్వర్యంలో నేత్రదానం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 03:** నంద్యాల పట్టణంలోని బొంతల వీధికి చెందిన మారెం శ్రీదేవి ( 45 ) అనే అవివాహిత ఆమె మరణాంతరం ఆమె కోరిక మేరకు వారి అన్న మారెం రమేష్ బాబు ఫ్రెండ్స్ ఫర్ సేవా సమితి అధ్యక్షుడు ఫణింద్రకు, చైర్మన్ విష్ణు గాయత్రి కి తెలియపరిచారు. వారు వెంటనే స్పందించి ఫ్రెండ్స్ ఫర్ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు బాపూజీ నాయక్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఐ బ్యాంకు వారికి తెలియపరిచి నేత్రాలను సేకరించి ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ ఫర్ సేవా సమితి అధ్యక్షుడు ఫణీంద్ర మాట్లాడుతూ మరణించిన తర్వాత వారి నేత్రాలు మట్టిలో కలిసిపోయే దాని కంటే నేత్రదానం చేయడం మంచిదన్నారు. ఒకరు నేత్రదానం చేయడం వలన 6 మందికి చూపు ప్రసాదించవచ్చునని తెలిపారు. దాదాపు ఇప్పటికే 65 మందికి పైగా అంధులకు చూపు వచ్చే విధంగా కృషి చేయడం జరిగిందన్నారు. ఎవరైనా మరణిస్తే మరణాంతరం నేత్రదానం చేయవలసిన కుటుంబ సభ్యులు నేత్ర ప్రాజెక్టు చైర్మన్ విష్ణు గాయత్రి కి తెలియపరచాలని పిలుపునిచ్చారు. నేత్రదానం చేయవలసిన సభ్యులు 7799056665 నెంబర్కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు భ్రమరాంబ, ప్రభాకర్, ఈ బ్లడ్ కోఆర్డినేటర్ కిషోర్, రమేష్ బాబు, అనిల్, సుధాకర్, సులోచన, ప్రదీప్ ,శైలజ, రెడ్ క్రాస్ టెక్నీషియన్స్ నాగన్న ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు బాసటగా..

# సిఎం రిలీఫ్ ఫండ్



ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు జూన్ 03: నిరుపేదలకు బాసటగా సిఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందని శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేల్పనూరు గ్రామం నందు నియోజకవర్గానికి చెందిన 24 మంది వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.16,45,960/- లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి గారు మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి చికిత్స కోసం, అనంతర సహాయం కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామన్నారు. ఈసందర్భంగా చెక్కులు అందుకున్న వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

## దీక్షిత కుటుంబానికి సహాయం అందించిన వైసీపీ నాయకులు.






**ఆంధ్ర ప్రగతి చాగలమర్రి జూన్ 03:** చాగలమర్రి మండలం, తోడెండ్లపల్లె గ్రామానికి చెందిన దీక్షిత అనే 4 సంవత్సరాల వయసు గల పాపను, మైలవరం మండలం మొరగుడి గ్రామానికి చెందిన రహమతుల్లా అనే కిరాతకుడు మానసికంగా, లైంగికంగా చిత్రహింసలు పెట్టి చంపేసి ముళ్ళపొదల్లో పడి వేయడం చాలా బాధాకరం. చనిపోయిన దిక్షిత కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మరియు నంద్యాల పార్లమెంట్ పరిశీలకులు శ్రీమతి కల్పలత రెడ్డి సమక్షంలో 2 లక్షల రూపాయలు చెక్కును ఆళ్ళగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్రారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇషాక్ భాష, నంద్యాల మాజీ పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, శ్రీశైలం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి, వైఎస్ఆర్సీపీ నాయకులు భూమా కిషోర్ రెడ్డి, చాగలమర్రి ఎంపిపి వీరభద్రుడు, షేక్ బాబూలాల్ గారు మరియు వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహానంది క్షేత్రంలో హైకోర్టు జడ్జి పూజలు.



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 03:** మహానంది పుణ్యక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి హరిహరనాథశర్మ మంగళవారం పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఈవో ఎన్.శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవాళ్ళను దర్శించుకుని, అభిషేకం, కుంకుమార్చన, తదితర పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం ఈవో శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ప్రతి కుటుంబాన్ని పిఎం సూర్య ఘర్ పథకం క్రింద నమోదు చేయండి.

**-ఋణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 03:** జిల్లాలో ప్రతి కుటుంబాన్ని పిఎం సూర్య ఘర్ పథకం క్రింద నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి పీఎం సూర్య ఘర్ పథకం అమలుపై ఏపీఎస్పీడీసీఎల్ ఇంజనీర్లు, ఎనర్జీ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ పథకం క్రింద నమోదు చేసుకున్న దరఖాస్తులలో 458 దరఖాస్తులు కన్వర్ట్ అయి సంబంధిత వెండర్ నుండి కమీషనింగ్ కు వెళ్లాయన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 97 వేల మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు సూర్యఘర్ సోలార్ ప్యానల్స్ కనెక్షన్ కోసం పేర్ల నమోదు చేసుకున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలు మినహా పిఎం సూర్య ఘర్ పథకం క్రింద దాదాపు 20 వేల మంది రిజిస్టర్ చేసుకోవడం జరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ అయి కన్వర్ట్ కింద ఉన్న 1513 దరఖాస్తులను కమీషనింగ్ ఈనెలాఖరిలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులలో మరో 1513 దరఖాస్తులు కమీషనింగ్ కోసం వెండర్ కు రావాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను కమీషనింగ్ చేసేందుకు వెండర్లు చర్యలు తీసుకునేలా ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా మిగిలిన దరఖాస్తులను త్వరితగతిన వెండర్ వద్దకు కమీషనింగ్ కు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు బ్యాంకుకు అనుసంధానం చేసి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న 27 బ్యాంకులకు 27 గ్రామాలు కేటాయించి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. పిఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించి ప్రజల్లో అవగాహన తీసుకొని రావాలని ఎనర్జీ అసిస్టెంట్లను కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకుల ద్వారా అందజేసే రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా పాండురంగాపురం గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని పిఎం సూర్య ఘర్ పథకం క్రింద తీసుకొని రావాలన్నదే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఏపీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీరు సుధాకర్ పాల్గొన్నారు.

## ప్రజలకు వెన్నుపోటు పొడిసింది

# జగన్ రెడ్డే



**-వెన్నుపోటుకు మారుపేరు వైసీపీ. -గొడ్డలిపోటు దినం కూడా జరుపుకోండి.**

**-శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి.**

**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు జూన్ 03:** వైసీపీ అరాచక పాలన నుంచి విముక్తి పొందిన రోజు జూన్ 4..జగన్‌రెడ్డి విధ్వంసకర పాలనతో విసిగిన ప్రజలు నరకాసురుడి పాలన నుంచి విముక్తి కోసం ఓటు రూపంలో తీర్పు ఇచ్చిన రోజు అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. నిజానికి ఈ రోజును ప్రజలు దీపావళిగా జరుపుకోవాలి. కానీ, వైసీపీ నాయకులకు ప్రజా తీర్పు వెన్నుపోటులా కనిపిస్తోందంటే ప్రజాస్వామ్యం పట్ల వైసీపీ పార్టీకి ఎంత గౌరవం ఉందో స్పష్టమవుతోందన్నారు. మద్యపాన నిషేధం అనే బూటకపు హామీతో అధికారంలోకి వచ్చి కల్తీ మద్యంతో 30,000 మంది అక్కచెల్లెమ్మలకు పసుపు-కుంకుమ దూరం చేసి వెన్నుపోటు పొడిచింది మీరు కాదా అని ప్రశ్నించారు. వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని ఉద్యోగులను మోసం చేసి వెన్నుపోటు పొడిచింది ఎవరు? జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని యువతను మోసం చేసి వెన్ను పోటు పొడిచింది ఎవరు? అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ పెంచుతామని ఐదేళ్ల పాటు ప్రజలను మోసం చేసి వెన్నుపోటు పొడిచింది ఎవరు? ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మఒడి ఇస్తానని మహిళలను వెన్నుపోటు పొడిచింది ఎవరు? అని ప్రశ్నించారు. ల్యాండ్, ఇసుక, మైనింగ్, మద్యం స్కామ్‌ల నుంచి ప్రజల దృష్టిని మళ్లించ డానికి, ప్రజాహితంగా సాగుతున్న కూటమి పాలనను చూసి ఓర్చుకోలేక నిత్యం ఏదో ఒక డ్రామాతో, డ్రామా ఆర్టిస్టులతో ప్రజాక్షేత్రంలో చచ్చిపోయిన పార్టీని బతికించు కోవడానికి జగన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడు. ప్రజలు ఛీకొట్టినా వైసీపీ అధినేతకు, నాయకులకు బుద్ధి రావడం లేదు. గొడ్డలి పోటు దినం, సొంత చెల్లి-తల్లిని గెంటేసిన దినం, అమ్మ మీద కేసు పెట్టిన దినం ఎప్పుడు జరుపుకుంటారో కూడా వైసీపీ నాయకులు ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి హితవుపలికారు.

# విలియం హార్వే సేవలు చిరస్మరణీయం

**బిసామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.**



**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 03:** జూన్ 03 న రక్త ప్రసరణ వ్యవస్థ ను కనుగొన్న శాస్త్రవేత్త విలియం హార్వే వర్ధంతి సందర్భంగాడోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో జూన్ 03 న రక్త ప్రసరణ వ్యవస్థను కనుగొన్న శాస్త్రవేత్త విలియం హార్వే గారి వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించి వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూ..మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు. విలియం హార్వే ఏప్రిల్ 1-1578 జన్మించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వైద్యశాస్త్రవేత్త. గుండె పనిచేసే తీరును, శరీరంలో రక్తప్రసరణ జరిగే పద్ధతిని వివరించి నేటి వైద్యులకు మార్గదర్శకుడయ్యాడు. ఈనాడు హృదయం గురించి అందరికీ తెలుసు. రక్త ప్రసరణ వ్యవస్థ మొత్తం ఎలా నడుస్తుందోచెప్పగలుగుతున్నారు. అదే 16 వ శతాబ్దం నాడయితే మనిషి గుండెకు సంబంధించిన పూర్తి వివరాలను మిగతా జంతువుల గుండెలతో పోల్చి చూసి శాస్త్ర బద్ధంగా అందజేసిన ఘనత విలియం హార్వేకు దక్కుతుంది. హార్వే 1657 సంవత్సరం జూన్ 3 న మరణించాడు. ఈయన ప్రయోగాల ద్వారా రాబట్టిన ఫలితాలే ఈ వేళ కూడా రోగ నిర్ణయం చేయటానికి ఉపయోగపడుతున్నాయి. సమాజానికి సేవలు అందించిన మహనీయులను అనుక్షణం స్మరించుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

# వైయస్ఆర్ నగర్ నందు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**సరైన ధ్రువపత్రాలు లేని ఐదు మోటార్ సైకిల్లు స్వాధీనం**

**శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు పోలీసులు అండగా ఉంటారనే భరోసా కల్పించేందుకు కార్డెన్ సర్చ్ ఆపరేషన్**

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 03:
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి జావళి ఆల్ఫోన్స్ సూచనలతో నేటి తెల్లవారుజామున జిల్లా పట్టణ కేంద్రంలోని వైయస్సార్ నగర్ నందు నంద్యాల తాలూకా ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, క్యూఆర్టి సిబ్బంది బృందాలుగా ఏర్పడి కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా తాలూకా ఇన్స్పెక్టర్ గారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు వైయస్సార్ నగర్ నందు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని ఇందులో అనుమానితులు మరియు నేరచరిత్ర గలవారు, రౌడీ షీటర్ల ఇళ్లని తనిఖీచేసి సరైన ధ్రువపత్రాలు లేని 05 బైక్ లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. అనంతరం ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి సరైన పత్రాలు లేని వాహనాలను కొనడం, తాకట్టు పెట్టుకోడం,





దొంగలించడం లాంటి పనులు చేయరాదని, గంజాయి రవాణా ,విక్రయం లాంటి నేరాలు చేస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మరియు ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ క్రైమ్ నేరాలు మొదలగు వాటిపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలియజేశారు. రాత్రి వేళలో అనవసరంగా బయట తిరిగితే బౌండ్ ఓవర్ కేసులు పెడతామని రౌడీషీటర్ల మీద మరియు సస్పెక్ట్ షీటర్ల కదలికల మీద గట్టి నిఘా ఉంచడంతోపాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు ఈశ్వరయ్య, వంశీధర్ ,చాంద్ బాషా మరియు సబ్-ఇన్స్పెక్టర్లు ధనమ్మ ,నజీర్ లు పాల్గొన్నారు.

# కార్మిక నాయకుడు కామ్రేడ్ బి.నాగన్న మృతి కార్మిక వర్గానికి తీరని లోటు.

**ఘనంగా నివాళులు అర్పించిన సిఐటియు నాయకులు సున్నం బట్టీలు ఫ్యాక్టరీల యజమానులు కార్మికులు.**

ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 03:
కార్మిక నాయకుడు కామ్రేడ్ బి.నాగన్న (75) మృతి కార్మిక వర్గానికి తీరని లోటు అని సిఐటియు మండల అధ్యక్షులు సున్నం బట్టీలు ఫ్యాక్టరీల వర్కర్స్ యూనియన్ నాయకులు పి.రామాంజనేయులు, బి.నాగమద్దయ్య,సీనియర్ నాయకులు జి.కొండయ్య,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య,జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం,మండల కార్యదర్శి ఎ.వి.భాస్కర్ రెడ్డి,సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్,బేతంచెర్ల పట్టణ కార్యదర్శి వైబి.వెంకటేశ్వర్లు డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు బి.లక్ష్మన్న అన్నారు. ధర్మవరం గ్రామానికి చెందిన కార్మిక నాయకుడు సున్నం బట్టీలు ఫ్యాక్టరీల హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కామ్రేడ్ బి.నాగన్న అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. మంగళవారం జరిగిన మృతుని అంత్యక్రియల్లో పాల్గొన్న వారు కోట్ల వారి పల్లి లోని మృతుని స్వగృహం నందు ఆయన భౌతికకాయంపై గౌరవ సూచకంగా సిఐటియు జెండాను కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.



మృతునికి భార్య ఇరువురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కామ్రేడ్ బి.నాగన్న కార్మికుల హక్కుల కోసం వారి సమస్యల పరిష్కారం పట్ల దాదాపు 35 సంవత్సరాలకు పైగా అంతిమ ఘడియల వరకు ఎనలేని కృషి చేసిన జీవితాన్ని కార్మిక వర్గం కోసం అంకితం చేసిన గొప్ప కార్మిక నాయకుడని కొనియాడారు. ఆయన భౌతికంగా దూరమవడం వారి కుటుంబానికే కాక కార్మిక వర్గానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. అజిపీరా,తిమ్మయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు,మధు తదితరులు కార్మికులు అధిక సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

**కామ్రేడ్ బి.నాగన్న మృతికి ప్రముఖుల నివాళులు**

ప్రముఖ న్యాయవాది నాగభూషణం రెడ్డి,పారిశ్రామికవేత్త పెద్ద నాగిరెడ్డి,సున్నం పట్టీలు ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి,యజమానులు సివి సుబ్బారెడ్డి, తిమ్మారెడ్డి,లక్ష్మీనారాయణ యాదవ్, రఘురామిరెడ్డి, బొజ్జలు తదితరులు మృతుని స్వగృహం నందు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. సంతాప సూచకంగా యజమానులు కార్మికులకు ఒక రోజు సెలవు ప్రకటించారు.

## మహనీయుల ఆశ్రయం జీవితానికి

# చరితార్థం చేకూరుస్తుంది.

**-డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తితిదే.**

**ఆంధ్ర ప్రగతి దేవనకొండ జూన్ 03:**
మహనీయుల ఆశ్రయం ఉత్తమ మార్గాన నడుచుటకు, ఉన్నత లక్ష్యానికి చేరుకోవడానికి తోడ్పడి జీవితానికి చరితార్థం చేకూరుస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ ఆధ్వర్యంలో దేవనకొండ మండలం, తెర్నేకల్ గ్రామంలోని శ్రీ కొండ మాధవ స్వామి దేవస్థానం నందు ఐదు రోజుల ధార్మిక కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గ్రామ సర్పంచ్ యం. అరుణ్ కుమార్ మాట్లాడుతూ సమాజాన్ని ఐకమత్యంగా ఉంచి ధర్మ మార్గాన నడిపించేది ధార్మిక కార్యక్రమాలేనని ఇటువంటి కార్యక్రమాలు జనులందరూ ఆదరించాలని పిలుపునిచ్చారు. తదనంతరం ధార్మిక ప్రవచకులు బత్తల సుంకయ్య శ్రీమద్రామాయణంపై ప్రవచించారు. స్థానిక భజన మండలి చేసిన భజనలు భక్తులను తన్మయపరిచినది. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ బూడిదిన్నె మధు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.టీ.సీ. ఎన్. శ్రీనివాసులు, ఆలయ ధర్మకర్త కొండగేరి శ్రీరాములు, బోయ చెన్నప్ప, సగర సంగం అధ్యక్షులు గడ్డం నాగరాజు, భజన మండలి అధ్యక్షులు కె. మురళి, మాల రాజు, మొండి పెద్ద మాదన్న, మూకి నాగేంద్ర, పూజారి మాదన్న, మాల పెద్దయ్య, మూలింటి మాదన్న, గుర్రాల లక్ష్మన్న, పాల్గొన్నారు. వడ్డె తిమ్మప్ప,దుమ్ము హనుమంతు,శ్రీ శివయోగి సిద్ధరంగ లింగేశ్వర శివాచార్య స్వామి శిష్య బృందంతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## వెన్నుపోటు దినోత్సవాన్ని

# విజయవంతం చేయండి.

**-మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 03:**
ఈనెల 4వ తేది ఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 4వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని నంద్యాల మాజీ ఎమెల్యే మాజీ ఎమ్యెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఇందులో భాగంగా నంద్యాలలోని ఉదయానందా రెసిడెన్సీ నుండి ఉదయం 9గంటలకు భారీ నిరసన ర్యాలీగా బయలుదేరి జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకొని కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిరసనను వ్యక్తం చేసి వినతి అందించడం జరుగుతుందని...ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దయెత్తున పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమెల్యే మాజీ ఎమ్యెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి కోరారు.



## ఉపాధి కూలీలకు డబ్బులు రాక

# పనికి రావడం లేదు.



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 03:** ఉపాధి కూలీలకు సరైన సమయంలో కూలీ డబ్బులు రాకపోవడంతో ఉపాధి పనులకు రావడంలేదని మహానంది మండల ఏ పీ ఓ మల్లికార్జున పేర్కొన్నారు. పై అంశం ఉపాధి కూలీలు చెబితే ఒక అర్థం ఉంది... కానీ ఒక అధికారి స్థాయిలో ఉండి కూలీలకు డబ్బులు ప్రభుత్వం సకాలంలో ఉపాధి కూలీలకు డబ్బులు విడుదల చేయకపోవడంతో తాము పనులు కూడా చేపించలేకపోతున్నామని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో ఉపాధి కూలీలకు పని చూపించేందుకుగాను ముందస్తు చర్యల్లో భాగంగా ఏ ఏ గ్రామాల్లో ఎన్ని పనులు చేయించాలి, ఎక్కడెక్కడ చేయించాలి, అత్యవసరమైనవి ఎన్ని పనులు ఉన్నాయి అనే అంశంపై వారి వద్ద ఎలాంటి నివేదిక లేకపోవడం పలు విమర్శలకు తావిస్తున్నట్లు తెలుస్తుంది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి పనుల్లో భాగంగా చేపట్టాల్సిన వివరాలు కు సంబంధించి నివేదికను మే నెల మధ్య వారంలో జిల్లా ఉన్నతాధికారులకు పంపడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఉపాధి పనులు చేయించడం సాధ్యమేనా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కేవలం ఉపాధి కూలీలకు ప్రభుత్వం సకాలంలో డబ్బులు చెల్లించడం లేదని అధికారి పైకి చెబుతున్న మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహించుకోవడానికి ప్రభుత్వానికి లేదా ఉన్నతాధికారులకు మే నెల రెండో వారంలో నివేదికలు తయారుచేసి పంపడం వారి పనితీరుకు నిదర్శనంగా మారింది. తాము చేసే తప్పులను ప్రభుత్వం లేదా ఉన్నత అధికారులపై నెట్టడంలో ఆ అధికారి సిద్ధహస్తుడని ఆరోపణలు వినవస్తున్నాయి.

# వృద్ధులకు వికలాంగులకు ఇంటి వద్దకు వెళ్లి నిత్యావసర సరుకుల పంపిణీ





**తాటికొండ బుగ్గరాముడు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 03:**
రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి.ఫరూక్,నంద్యాల జిల్లా ప్రాధన కార్యదర్శి ఎన్ ఎండి.ఫిరోజ్, రాష్ట్ర యువ నాయకుడు ఎన్ ఎండి.ఫయాజ్ ఆదేశాలతో మంగళవారం ఉదయం వై.యస్.ఆర్ నగర్ మరియు నందమూరి నగర్ నందు గల చౌక ధరల దుకాణాల ద్వారా వృద్దులకు,వికలాంగులకు ఇంటి వద్దకు వెళ్లి నిత్యావసర సరుకుల ను38వ వార్డు టీడీపీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతు రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రజలకు చక్కని పరిపాలన అందించేందుకు కృషి చేస్తుందన్నారు. చౌక ధరల దుకాణాల ద్వారానే నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని రాష్ట్ర కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని అన్నారు ఈ నిర్ణయం మేరకు జూన్ 1వ తేదీ నుండి వినియోగదారులకు చౌక దుకాణాల వద్ద బియ్యం, చక్కెర,గోధుమలు తదితర సరుకులు పంపిణీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వృద్దులకు వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి నిత్యవసర సరుకులు పంపిణీ చేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తాటికొండ మహేష్ బాబు,మల్లాపురం చిన్న రాముడు,రత్నం శెట్టి, రమణ,ధనుజయుడు తదితర నాయకులు, వై.యస్.ఆర్ నగర్ మరియు నందమూరి నగర్ కాలనీ వాసులు మరియు కాలనీ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# టంగుటూరి శ్రీనివాసులు పై పాణ్యం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు.

**ఆంధ్ర ప్రగతి పాణ్యం జూన్ 03:**
నంద్యాల జిల్లా, పాణ్యం మండలం, మద్దూరు గ్రామంలో శనగల, మినుముల వ్యాపారి టంగుటూరి శ్రీనివాసులు 8,42,350/- రూపాయలు ఇవ్వకుండా మోసం చేయడమే కాకుండ బెదిరింపులకు పాల్పడటంపై మద్దూరు నివాసి కొప్పెర స్వామిదాస్ కుమారుడు సతీష్ కుమార్ ఇచ్చిన పిర్యాదు మేరకు పాణ్యం పోలీస్ స్టేషన్లో చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె సతీష్ కుమార్ మాట్లాడుతూ తాము ఇచ్చిన పిర్యాదు మేరకు స్పందించిన పాణ్యం పోలీసులు భారతీయ న్యాయ సంహిత 2023 ప్రకారం సెక్షన్ల 318(4), 351(2) క్రింద మరియు ఎస్.సి అట్రాసిటీ యాక్ట్ 1989 ప్రకారం సెక్షన్ 3(1)(ఆర్), 3(1)(ఎస్), 3(2)(వి.ఎ)ల క్రింద ఎఫ్.ఐ.ఆర్ నం. 55/2025, తేదీ : 02.06.2025 గా నమోదు చేసినట్లు



అందుకు గాను సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా అడ్వకేట్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తక్షణమే విచారించి బాధితులకు న్యాయం చేయాలని, మద్దూరులో నివాసముంటున్న మొహమ్మద్ రఫీక్ అనే టీచర్ కు కూడా 4,75,000/- డబ్బులు ఇవ్వాలని, మరింతమంది బాధితులు స్టేషన్ ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. తమ వంతుగా గౌరవ న్యాయస్థానంలో న్యాయ సహాయం కూడా అందిస్తామని తెలిపారు. సతీష్ కుమార్ మాట్లాడుతూ మోసపూరిత వ్యాపారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అలాంటి వారిపై తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సతీష్ కుమార్, రఫీక్, మౌలి భాష, సంజీవ్ కుమార్, అడ్వకేట్ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

# 30 లక్షల పాత బకాయిలు విడుదల.



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 03:** 30 లక్షల రూపాయల పాత బకాయిలను విడుదల చేసినట్లు మహానంది దేవస్థానం ఈవో నల్ల కాలువ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆలయంలో పనిచేస్తున్న 85 మంది ఏజెన్సీ సంబంధించి కి సంబంధించి మార్చి ,ఏప్రిల్ నెలలలో ఇవ్వాల్సిన జీతభత్యాలు విడుదల చేశామన్నారు. కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆలయ నిధులనుండి 30 లక్షలు రూపాయలు విడుదల చేయడం జరిగింది అన్నారు. మే నెల కు సంబంధించి ఏజెన్సీ సిబ్బందికి జీతభత్యాలు రెండు మూడు రోజుల్లో చెల్లిస్తామన్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసరెడ్డి నిర్ణయంతో ఏజెన్సీ సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడ్డామని ఇప్పుడు జీతాలు విడుదల అయ్యాయని తెలియడం సంతోషకర విషయం అని పేర్కొన్నారు.

# రామేశ్వరంనకు ప్రత్యేక రైలు

హైదరాబాద్, **జూన్ 03, ఆంధ్ర ప్రగతి:** తమిళనాడులో ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామేశ్వరం వెళ్లే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. చర్లపల్లి - రామనాథపురం మధ్య ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు- పేర్కొంది. చర్లపల్లి-రామనాథపురం (07695) రైలు ఈ నెల 11 నుంచి 25 వరకు ప్రతి బుధవారం రాకపోకలు సాగిస్తుందని చెప్పింది. అలాగే, రామనాథపురం నుంచి చర్లపల్లి (07696) రైలు ఈ నెల 13 నుంచి 27 వరకు ప్రతి శుక్రవారం రైలు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, చెన్నై ఎగ్మోర్, చెంగల్పట్టు-, విల్లుపురం, చిదంబరం, సిర్కాజీ, మయిలదుతురై, తిరువూర్, తిరుతురైపూండి, అదిరంపట్టణం, పుదుకొట్టై అర్ణతాంగి, కారైకుడి, శివగంగ, మానమాదురై స్టేషన్లలో రైలు ఆగుతుందని పేర్కొంది. రైలులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉన్నాయని వివరించింది.

# తెలంగాణ నేతన్నకు భరోసా పథకం

## రూ. 48.00 కోట్లు కేటాయింపు - మంత్రి తుమ్మల

హైదరాబాద్, **జూన్ 03, ఆంధ్ర ప్రగతి: ,:** : నేత కార్మికుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులోభాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తెలంగాణ చేనేత అభయహస్తంలో భాగంగా తెలంగాణ నేతన్నకు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్ రూ. 48.00 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా జియో ట్యాగ్ చేయబడిన మగ్గాలపై పనిచేస్తున్న కార్మికులకు మరియు అనుబంధ కార్మికులకు వేతన ప్రోత్సాహకం కింద గరిష్టంగా సంవత్సరానికి నేత కార్మికులకు రూ. 18,000 , అనుబంధ కార్మికులకు రూ. 6,000 అందించడం జరుగుతుందన్నారు. దీంతో దాదాపు 40,000 మంది చేనేత మరియు అనుబంధ కార్మికులు లబ్ధి పొందుతారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలకు ప్రత్యేకంగా తయారుచేయబడిన యూనిక్ లోగోను జతచేయడం జరుగుతుందని, తద్వారా చేనేత ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను మరియు నేత కార్మికుని వివరాలను వినియోగదారులు తెలుసుకోవచ్చు. దీంతో తెలంగాణ చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరిగే అవకాశాలు ఏర్పడతాయని మంత్రిగారు తెలియజేశారు. ఈ పథకం నేత మరియు అనుబంధ కార్మికులందరికీ వర్తిస్తుంది. 18 సంవత్సరాలు నిండి జియో ట్యాగ్ చేయబడిన మరమగ్గాలపై పనిచేసే కార్మికులు మరియు ప్రీలూమ్, ప్రిపరేటరి పనులైన డైయింగ్, -టైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైండింగ్, సైజింగ్ మొదలైన అనుబంధ పనులు చేసే కార్మికులు, చేనేత వృత్తి ద్వారా వారి వార్షిక ఆదాయంలో కనీసం 50 శాతం పొందుతున్నవారు అర్హులు. ఈ పథకం కింద జియో ట్యాగ్ చేయబడిన మగ్గాల ద్వారా వార్పులలో కనీసం 50 శాతం కంటే ఎక్కువ పూర్తి చేసిన నేత మరియు అనుబంధ కార్మికులకు నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి వేతన ప్రోత్సాహకం కింద సంవత్సరానికి రెండు విడతలుగా ఏప్రిల్ నుండి సెప్టెంబర్ మరియు అక్టోబర్ నుండి మార్చి నేత కార్మికునికి రూ. 9,000, అనుబంధ కార్మికునికి రూ. 3,000 జమ చేయడం జరుగుతుంది. అయితే మొదటి విడతలో 50 శాతం వార్పులు పూర్తి చేయని వారు, రెండో విడతలో పూర్తి చేసినట్లతే మొత్తం ప్రోత్సాహకం సంవత్సరాంతంలో చేనేత మరియు అనుబంధ కార్మికులకు అందించబడుతుందని మంత్రి తెలిపారు.

# 'యోగా డే'పై ప్రజా స్పందన ఉత్సాహాన్నిస్తోంది: సీఎం చంద్రబాబు



**అమరావతిజూన్ 03, ఆంధ్ర ప్రగతి: ,:** ఈ నెల 21వ తేదీన ఏపీలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా డే కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన రిజిస్ట్రేషన్లు, జిల్లాల్లో జరుగుతున్న యోగా సాధన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం సంతృప్తికరంగా ఉందని తెలిపారు. పూర్తి స్థాయి సన్నద్ధతతో, ప్రజల భాగస్వామ్యంతో అత్యధిక మందితో యోగా నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించాలనే లక్ష్యాన్ని పూర్తి చేయాలని సీఎం నిర్దేశించారు. జూన్ 21న విశాఖలో 5 లక్షలమంది పాల్గొనేందుకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా జరగాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాక సందర్భంగా ట్రాఫిక్ పరంగా ఆంక్షలు ఉంటాయని... వీటిని దృష్టిలో పెట్టుకుని ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం అన్నారు. అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు యోగా డే కార్యక్రమానికి వస్తారని... ఎవరు ఎటు వెళ్లాలి... ఎక్కడ కార్యక్రమంలో పాల్గొనాలి... అనే విషయంలో ముందుగానే గైడ్ చేయాలని సీఎం అన్నారు. ట్రాఫిక్ సహా ఏ ఇబ్బందీ ఉండకూడదు... అందరూ నిర్దేశించిన ప్రాంతానికి చేరుకునేలా చూడాలని స్పష్టం చేశారు. యోగా డే కంటే ముందు రెండు సార్లు రాష్ట్ర స్థాయిలో భారీగా ప్రీ ఈవెంట్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. "7వ తేదీ ప్రతి గ్రామంలో, ప్రతి ప్రాంతంలో యోగా డే అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తారు. 14 వతేదీ రాష్ట్రంలో లక్ష ప్రాంతాల్లో యోగా ప్రాక్టీస్ చేస్తారు. ప్రతి విద్యా సంస్థతో పాటు అవకాశం ఉన్న అన్ని సంస్థలు, ప్రాంతాల్లో 14వ తేదీ యోగా నిర్వహించి యోగా డేకు ప్రజలను సిద్ధం చేస్తారు. తద్వారా యోగా డే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనేలా చేయాలి" అని సీఎం వివరించారు. మంగళవారం ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో యోగా డే కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. ఈ సమీక్షకు మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్, వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయస్వామి, సత్యకుమార్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హాజరయ్యారు. యోగా మంత్‌లో భాగంగా ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాలను, యోగా డే నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రోజుకో థీమ్‌తో వివిధ వర్గాల ప్రజలతో జిల్లాల్లో నిర్వహిస్తోన్న కార్యక్రమాలకు వస్తున్న స్పందనను అధికారులు వివరించగా... చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. 21వ తేదీన విశాఖలో వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా చేసేందుకు జర్మన్ హ్యాంగర్లతో మరో వేదిక సిద్ధ చేసినట్లు అధికారులు తెలిపారు.

# తెలిసిన వ్యక్తుల పేర్లతో బురిడీ...

## ఆదమరిస్తే వాట్సప్ గల్లంతు! -ఖాతాలు అధీనంలోకి తెచ్చుకుంటున్న వైనం




హైదరాబాద్: **జూన్ 03, ఆంధ్ర ప్రగతి:**
ఇది వాట్సప్ లోకం. చాలామంది దానిని చూడకుండా ఎక్కువసేపు ఉండలేరు. అందుకే సైబర్ నేరగాళ్లు దానిపై కన్నేశారు. ఆదమరిస్తే వాట్సప్‌ను కొట్టేస్తున్నారు. అంటే అందులోని ఫోన్ నంబర్లు, ఫొటోలు, వీడియోలు, వృత్తిపరమైన వ్యక్తిగతమైన సమాచారం అంతా చోరీ చేయడం అన్నమాట. వనజ ఒక గృహిణి. ఇటీవల ఆమె పిల్లలు చదువుతున్న విద్యాసంస్థలో పనిచేసే ఉపాధ్యాయురాలి ఫోన్ నంబర్ నుంచి ఒక మెసేజ్ వచ్చింది.నా వాట్సప్ రీ ఇన్‌స్టాల్ చేసుకుంటున్నా పొరపాటున నా నంబర్ బదులు మీది ఇచ్చా కోడ్ మీకు వచ్చింది.. దాన్ని నాకు పంపండి' అన్నది దాని సారాంశం. తెలిసిన వ్యక్తే కదా అన్న ఉద్దేశంతో వనజ తనకు వచ్చిన కోడ్‌ను ఆమెకు పంపారు. అంతే.. వెంటనే వనజ వాట్సప్ పనిచేయడం మానేసింది. ఏమైందో అర్థం కాక ఆమె అయోమయానికి గురయ్యారు. నిపుణులతో మాట్లాడితే వాట్సప్‌ను నేరగాళ్లు వారి అధీనంలోకి తెచ్చుకున్నారని చెప్పారు.

### ఇలా పావులు కదుపుతారు...

సైబర్ నేరగాళ్లు రకరకాల మార్గాల్లో అనేక మంది ఫోన్ నంబర్లు, ఫొటోలు, మెయిల్ ఐడీల వంటి వివరాలు సంపాదిస్తారు. వాటి ద్వారా పావులు కదపడం మొదలు పెడతారు. సమాచారాన్ని తస్కరించేందుకు వారి ఫోన్లో ఆయా వ్యక్తుల వాట్సప్‌ను ఇన్‌స్టాల్ చేసేందుకు ప్రయత్నిస్తారు. వనజకు మెసేజ్ పంపినట్లే ఇతరులకు కూడా మెసేజ్ పంపి కోడ్ కోసం తొందర పెడతారు. కోడ్ పంపితే వనజకు ఎదురైన అనుభవమే వారికీ ఎదురవుతుంది. వాట్సప్ నేరగాడి అధీనంలోకి వెళ్లిపోతుంది.

### గొలుసుకట్టు కథ మొదలు..

ఇదొక గొలుసుకట్టు మోసం. ఒకరి వాట్సప్ అధీనంలోకి తెచ్చుకోగానే నేరగాడు అందులో ఉన్న వారందరికీ మెసేజ్‌లు పంపడం మొదలుపెడతాడు. వాట్సప్ రీయాక్టివేషన్‌లో భాగంగా పొరపాటున తన నంబర్ బదులు మీ ఫోన్ నంబర్ ఇచ్చానని మళ్లీ పాత కథే చెబుతాడు. వచ్చిన కోడ్‌ను తనకు పంపమని అడుగుతాడు. అడుగుతున్నది తెలిసిన వ్యక్తి, ఫోన్ నంబర్ కూడా తెలిసిన వారిదే కాబట్టి సాధారణంగా ఎవరికీ అనుమానం రాదు. వచ్చిన కోడ్‌ను పంపుతారు. దాంతో వారి వాట్సప్‌లో డేటా మొత్తం చోరీ చేసి వాటి ద్వారా మరింత మందిని బోల్తా కొట్టిస్తాడు. డేటాను అడ్డం పెట్టుకొని బెదిరిస్తాడు. మోసాలకు దిగుతాడు.

### అత్యవసరంగా డబ్బు అవసరం పడిందనీ అడగవచ్చు...

ఒకసారి మన వాట్సప్ మరో వ్యక్తి అధీనంలోకి వెళితే అందులోని సమాచారంతో సైబర్ నేరగాళ్లు ఎంతకైనా తెగించవచ్చు. మనమే అడిగినట్లుగా అత్యవసరంగా డబ్బు అవసరం పడిందని మెసేజ్‌లు పెట్టవచ్చు. అడుగుతున్నది తెలిసిన వ్యక్తే కదా అని చాలామంది డబ్బు పంపే అవకాశం ఉంది. అలానే మన వాట్సప్‌లో బ్యాంకు ఖాతాకు సంబంధించిన వివరాలు ఉంటే అందులో ఉన్న డబ్బంతా కొట్టేయవచ్చు. చాలామంది ఎవరైనా మిత్రులు, బంధువులు షాపింగ్‌కు వెళ్లినప్పుడు తమ క్రెడిట్‌కార్డును ఫొటో తీసి వారికి పంపుతారు. దాని ద్వారా వారు చెల్లింపులు జరుపుతారు. ఇలా వాట్సప్‌లో ఉన్న క్రెడిట్‌కార్డు ఫొటో నేరగాళ్లకు చిక్కితే దాన్ని దుర్వినియోగం చేస్తారు. ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో పెడతామని బెదిరింపులకు దిగవచ్చు.

### ఎలా బయటపడాలంటే...

అసలు ఎవరూ కూడా మరో వ్యక్తి నంబర్‌తో వాట్సప్‌ను రీయాక్టివేట్ చేసుకోరు. ఒకవేళ అలా ఎవరైనా చేసినట్లు చెబితే దాన్ని అనుమానించాలి. మళ్లీ అసలు నంబర్ ద్వారా రీయాక్టివేట్ చేసుకోవాలని చెప్పాలి. "ఒకవేళ పొరపాటున కోడ్ పంపడం వల్ల వాట్సప్ నేరగాడి అధీనంలోకి వెళితే అసలు వ్యక్తి వాట్సప్ పనిచేయడం ఆగిపోతుంది. అటువంటప్పుడు తెలిసిన వ్యక్తులకు ఫోన్ చేసి, వారి ఫోన్లలో తన పేరుమీద ఉన్న వాట్సప్ ఖాతా తెరిచి, దాన్ని 'రిపోర్ట్' చేయమని చెప్పాలి" అని సైబర్ ఫోరెన్సిక్ నిపుణులు పాటిబండ్ల ప్రసాద్ సూచించారు. ఎక్కువ మంది రిపోర్ట్ అని కొట్టగానే వాట్సప్ ఆటోమెటిక్‌గా 24 గంటలపాటు ఆ ఖాతాను బ్లాక్ చేస్తుందని, తర్వాత అసలు వ్యక్తి మళ్లీ తన నంబర్ ద్వారా వాట్సప్ రీయాక్టివేట్ చేసుకోవచ్చని ఆయన వివరించారు.

# తుని రైలు దగ్గం కేసులో సర్కార్ కక్షసాధింపు చర్య

**● కావాలనే హైకోర్టుకు వెళ్లే యోచన ● కాపులంటే చంద్రబాబుకు పడదు: అంబటి**



**అమరావతిజూన్ 03, ఆంధ్ర ప్రగతి: ,:** 2014 - 19 మధ్య కాలంలో జరిగిన తుని రైలు దగ్ధం కేసులో కాపు నేత ముద్రగడ పద్మనాధం సహా మరో 40 మందిపై అప్పట్లో కేసు నమోదైందని.. ఆ తర్వాత సరైన సాక్ష్యాలు లేకపోవటంతో కోర్టు కొట్టివేసిందని వైసీపీ మాజీమంత్రి అంబటి రాంబాబు అన్నారు.. అప్పటి ఘటనపై తాజాగా ప్రభుత్వం హైకోర్టుకు వెళ్లాలనుకుందని చెప్పారు.. సీఎం చంద్రబాబుకు కాపులు అంటే ఎందుకంత కోపం..? అని ప్రశ్నించారు. కాపులను బీసీల్లోకి చేరుస్తామని మ్యానిఫెస్టోలో పెట్టిన చంద్రబాబు.. ఇప్పుడు ఈ అంశంపై పట్టించుకోవడం లేదన్నారు. కాపులను బీసీల్లో చేర్చాలను ముద్రగడ పద్మనాభం నిరసనలకు ఆందోళన చేపట్టారని.. తునిలో భారీ బహిరంగ సభ జరిగిందన్నారు.. సభ తర్వాత రైల్వే ట్రాక్ పై రత్నాచల్ ఎక్స్ ప్రెస్ తగులబడిందని వెల్లడించారు. రైలును కాపులే తగులబెట్టారని అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు..ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులపై కేసులు పెట్టి వేధించారని వైసీపీ మాజీమంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు.. అప్పట్లో తాను, దాసరి నారాయణరావు, చిరంజీవి, బొత్స వంటి కాపు నేతలు హైదరాబాద్ లో సమావేశమయ్యామన్నారు.. వంగవీటి రంగాను కోల్పోయినట్లు- ముద్రగడను కోల్పోకూడదని గట్టిగా తీర్మానించుకున్నట్లు- తెలిపారు.. చంద్రబాబు ముద్రగడపై కక్షయ కట్టి కేసులు పెట్టారని.. నిరసన కార్యక్రమాలపై పెద్ద ఎత్తున కేసులు పెట్టారన్నారు.. జగన్ సీఎం అయిన తర్వాత కాపు ఉద్యమకారుల మీద పెట్టిన కేసులు మొత్తం తీసివేయించారని చెప్పారు.. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఆ కేసుపై అప్పీలు చేయాలని జీవో ఇచ్చినట్లు తెలిపారు. కొట్టివేసిన కేసులు తిరగతోడాలని చూడటం దుర్మార్గమని వైసీపీ మాజీమంత్రి అంబటి రాంబాబు అన్నారు. కాపు ప్రజానీకంతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తాం.. ఇది అరాచకమైన కార్యక్రమమని గుర్తు చేస్తున్నాం.. చంద్రబాబు, హోంమంత్రికి తెలియకుండా ఆ అప్పీలు ఆపివేస్తూ జీవో ఇచ్చారా.. అలా వచ్చి ఉంటే వాళ్ళంత అసమర్థులు మరొకరు ఉండరు.. ఎందుకు సంతకం పెట్టారు.. ఎందుకు వద్దన్నారు.. చంద్రబాబు బయటకు వచ్చి పొరపాటు- జరిగిందని ఒప్పుకోవాలి.. మేము 2వ తేదీ ఇచ్చిన జీవో పొరపాటు-న వచ్చింది.. కళ్ళు మూసుకున్నామని చెప్పాలి.. తనది డేగ కన్ను అని చెప్పుకునే చంద్రబాబు.. మీకు ఇది కనిపించలేదా.. కాపు సమాజానికి సమాధానం చెప్పాలని చంద్రబాబును కోరుతున్నా.. చంద్రబాబు సమాధానం చెప్పకుంటే మా కార్యాచరణ రూపొందిస్తాం.. నీ ప్రభుత్వంలో జీవో ఎలా వచ్చిందో మీకే తెలియదా.. ఎలా వచ్చిందో ఎం-కై-÷-వరీ చేసే పరిస్థితికి దిగజారిపోయారా.. ఇవన్నీ డ్రామాలు.. లీకులు ఇచ్చి తూచ్ అనాలని చూస్తున్నారు.. అందరూ దొంగలు.. అన్నీ నాటకాలు.. వైసీపీ కాపులపై తీసేసిన కేసులు మళ్లీ పెట్టాలని చూస్తున్నారా.. ఇవాళ టీ-డీపీలో ఉన్న చాలామంది కాపులు తుని సభకు వచ్చారు.. కాపులను బీసీల్లో చేర్చటం మా సెంటిమెంట్.. ఏ పార్టీలో ఉన్నా కాపులందరితో మాట్లాడతాం.. చంద్రబాబు ఏమైనా చేస్తాడు.. కొట్టేసిన కేసులు మళ్లీ తిరగతోడతాడు.. అడ్డు అదుపు లేని అరాచక పాలన చేస్తుంది.. ట్రిపుల్ ఆర్ వ్యాఖ్యలని పెద్దగా సీరియస్ గా పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఆయన వ్యాఖ్యానించారు.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లు వచ్చేస్తున్నాయ్ !




**అమరావతిజూన్ 03, ఆంధ్ర ప్రగతి: ,:**

ఏపీలో ప్రతీ ఇంటికీ ప్రీ పెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు రంగం సిద్ధం అయింది. ఈ మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఇప్పటికే పచ్చ జెండా ఊపేసింది. ఉత్తర్వులు కూడా జారీ చేసింది. దాంతో దశల వారీగా ఏపీలో ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లకు శ్రీకారం చుట్టనున్నారు. ఇక తొలి దశలో ఏకంగా నలభై లక్షల ఇళ్ళకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించాలని నిర్ణయించారు. అలా దశలవారీగా చూసుకుంటూ ఏపీ మొత్తంగా రెండు కోట్ల ఇళ్ళకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇక ఏపీడీసీఎల్ ఉత్తర్వులు జారీ చేయడంతో తొలి దశ బిగింపులకు రంగం సిద్ధం అయిపోయింది. అలా మొదటి దశలో ఉమ్మడి కృష్ణా ప్రకాశం, గుంటూరు జిల్లాలలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాలు పట్టణాలలో దాదాపుగా పదకొండు లక్షల ఇళ్ళకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు అంతా సిద్ధం చేశారు. అంతే కాదు ఇంటితో పాటు వ్యాపార సంస్థలకు సైతం స్మార్ట్ మీటర్లను బిగించేందుకు రెడీ అవుతున్నారు. అయితే ఈ స్మార్ట్ మీటర్ల బిగింపును వామపక్షాలు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. పేదలు మధ్యతరగతి వర్గాలకు ఈ విధానం పెను భారం అవుతుందని ఆరోపిస్తున్నాయి. ప్రీపెయిడ్ అంటే ముందుగానే సొమ్ము చెల్లించాలని అలా చేసే ఆర్థిక స్తోమత ఎంతమందికి ఉంటుందని ప్రశ్నిస్తున్నాయి. ఒక పల్లెలో ఉన్న వారు ప్రీపెయిడ్ చేసుకునే అవగాహన లేకపోతే ఏ సమయంలో అయినా కరెంట్ పోతుందని అపుడు వారు అంధకారంలోనే మగ్గుతారని కూడా అంటున్నారు. పైపెచ్చు స్మార్ట్ మీటర్ల ద్వారా అధిక చార్జీలు వసూల్ చేస్తారని అంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలలో అధిక విద్యుత్ వాడకం ఉండే సమయాలలో ప్రత్యేక రేట్లు పెడతారని ఆ విధంగా స్మార్ట్ మీటర్లతో దోపిడీయే అని అంటున్నారు అంతే కాదు స్మార్ట్ మీటర్ల పేరుతో ఒక్కో మీటర్ బిగించడానికి పదమూడు వేల రూపాయలు అవుతుందని దానిని ప్రతీ నెలా బిల్లులోనే వసూలు చేస్తారని అది మరో అదనపు భారం అని అంటున్నారు. ఆందోళన రేపుతున్న సర్వే ఫలితాలు ఇక స్మార్ట్ మీటర్లతో ఏపీ వ్యాప్తంగా ప్రజల నుంచి ముందుగానే ఏకంగా పాతిక వేల కోట్ల రూపాయలు అందుకోవడానికి వేస్తున్న పథకం అని కూడా విమర్శిస్తున్నారు. ఎన్నో లొసుగులు సందేహాలు ఉన్న ఈ విధానాన్ని టీడీపీ ఆనాడు విపక్షంలో ఉన్నపుడు వ్యతిరేకించి అధికారంలో ఉన్నపుడు తామే అమలు చేయడమేంటి అని కామ్రేడ్స్ ప్రశ్నిస్తున్నాయి. దీని మీద తాము ఉద్యమిస్తామని చెబుతున్నాయి. అయితే ఇప్పటికే నిర్ణయం తీసుకోవడం వల్ల స్మార్ట్ మీటర్ల బిగింపు అన్నది ఏపీలో స్టార్ట్ అవుతుందని చెబుతున్నారు. మరి దీని మీద వచ్చే మంచి చెడులు ఏమిటన్నది జనాలకు అనుభవంలోనే తెలుస్తుంది అని అంటున్నారు. ప్రభుత్వ పెద్దలేమో ఇది మంచి కార్యక్రమమని నాణ్యమైన నిరాటంకమైన విద్యుత్ ని సరఫరా చేయడానికి ఈ విధానం ఎంతగానో దోహదపడుతుందని చెబుతున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# అభిజీత్ ముహూర్తంలో రామ దర్బార్ పవిత్రీకరణ

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామమందిర నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు ఆలయంలో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుంది. 2024 జనవరి 22న గర్భ గుడిలో బాల రామయ్య విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఇప్పుడు రెండవ ప్రాణ ప్రతిష్ఠ వేడుక ఈ రోజు నుంచి ప్రారంభమైంది, ఇది జూన్ 5న రామ్ దర్బార్ లోని విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠతో పూర్తవుతుంది. గంగా దసరా కూడా జూన్ 5న జరుపుకోనున్నారు. అయితే రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ ఆలయంలో జరుగుతుంది. ఈ సమయంలో భక్తులు రామ దర్బార్ ను దర్శనం చేసుకోలేరు.రామ దర్బార్ ను చూసేందుకు ప్రణాళిక వేసుకుంటున్న భక్తులు ఈ నెల 5న భక్తులు అయోధ్యకు రావద్దని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ విజ్ఞప్తి చేశారు. ఎందుకంటే వాతావరణం దృష్ట్యా రామ దర్బార్ ప్రతిష్ట సమయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం లేదని ఈ కార్యక్రమం కోసం ఎవరినీ ఆహ్వానించలేదని చెప్పారు. ఆయన సోషల్ మీడియా ద్వారా భక్తులను కోరారు.

అయితే.. భక్తులు యధావిధిగా బాల రామయ్యను దర్శనం చేసుకోవచ్చని ఆయన అన్నారు. అంతేకాని ప్రత్యేక ప్రణాళికతో మాత్రం భక్తులు అయోధ్యకు రావద్దని అభ్యర్థించారు. రామమందిరం మొదటి అంతస్తులో రామ దర్బార్‌తో పాటు.. ఆలయ ప్రాంగణంలో మిగిలిన 6 దేవాలయాలను కూడా ప్రతిష్టించనున్నారు. ఇవి గణేశుడు, శివుడు, భగవతి, హనుమంతుడు, సూర్యుడు, అన్నపూర్ణ దేవి సహా శ్రీ విష్ణువు అవతారంలోని మిగిలిన విగ్రహాలను ప్రతిష్టించనున్నారు. వీటికి సంబంధించిన ఆచారాలు ఈరోజు (జూన్ 3వ తేదీ మంగళవారం) నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు.జూన్ 5న



ఉదయం 6:30 గంటలకు రామ దర్బార్ ప్రతిష్ట కార్యక్రమానికి కర్మ ప్రారంభమవుతుంది. ఈ సమయంలో శ్రీ రాముని ప్రాణ ప్రతిష్ఠ ఉదయం 11:30 గంటలకు అభిజిత్ ముహూర్తంలో జరుగుతుంది. ఈ కార్యక్రమం జరిగే సమయంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉంటారు. మధ్యాహ్నం 1 గంట వరకు రామ దర్బార్ కు సంబంధించిన కార్యక్రమాలు జరగనున్నవి. సోమవారం ఉదయం జూన్ 2వ సరయు ఒడ్డున మాతృ శక్తి ద్వారా భక్తితో గొప్ప కలశ యాత్ర జరిగింది. ఈసారి ప్రాణ ప్రతిష్ఠ ముహూర్తాన్ని అయోధ్య పండితులు నిర్ణయించారు. =

# గ్లోబల్ డిజిటల్ లీడర్‌గా భారత్

**బ్రెజీలియా :** బ్రిక్స్ దేశాల మధ్య సైబర్ భద్రత మరింత బలోపేతం కావాలని కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. స్టార్టప్ అభివృద్ధి, టెలీ కమ్యూనికేషన్స్, డేటా ప్రొటెక్షన్ చట్టం, డిజిటల్ స్కిల్స్ తదితర కార్యక్రమాలు భారత్‌ను గ్లోబల్ డిజిటల్ లీడర్‌గా నిలబెడుతున్నాయన్నారు. డిజిటల్ ప్రగతికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దూరదృష్టి, నాయకత్వమే కారణమని స్పష్టం చేశారు. బ్రెజిల్ రాజధాని బ్రెజీలియాలో నిర్వహించిన 11వ బ్రిక్స్ కమ్యూనికేషన్స్ మంత్రుల సమావేశంలో భారత తరఫున ప్రతినిధిగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. భారతదేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ)లో ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న డిజిటల్ మార్పు జరుగుతోందని కేంద్రమంత్రి వివరించారు. డిజిటల్ సమావేశం ఒక జాతీయ లక్ష్యమే కాదని, అది ప్రపంచ అవసరమని పెమ్మసాని స్పష్టం చేశారు. ఆ క్రమంలో ఆధార్, యూపీఐ సహా తదితర అంశాల్లో భారత్ ఏ విధంగా డిజిటల్ చైతన్యం సాధించిందనేది ఈ సందర్భంగా ఆయన సోదాహరణగా వివరించారు. ఆధార్ ద్వారా 95 కోట్ల మందికి పైగా ప్రజలకు భరోసా కలిగించే డిజిటల్ ఐడెంటిటీ లభించిందన్నారు. దీని వల్ల ప్రభుత్వ, ప్రైవేట్ సేవలకు మరింత సౌలభ్యమైందని చెప్పారు. యూపీఐ ద్వారా జరిగే డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో 46 శాతం వాటా భారత్‌దేనని గుర్తు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ఒక స్థిరమైన, అంచనా వేయదగిన డిజిటల్ వ్యవస్థను నిర్మించిందని వివరించారు. అలాగే బ్రిక్స్ దేశాల మధ్య డీపీఐ సహకారం పెంచుకోవాల్సి ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక సమావేశం, ప్రభావంతమైన పాలనకు డీపీఐ ఒక కీలక




సాధనమని పేర్కొన్నారు. ఇక టెలికం మోసాలను ఎదుర్కొనే సంచార్ సాథీ కార్యక్రమం గురించి మంత్రి డాక్టర్ పెమ్మసాని సోదాహరణగా వివరించారు.

**ఈ సదస్సులోని ప్రధాన అంశాలు..**

కనెక్టివిటీ, స్థిరమైన స్పేస్ వినియోగం, పర్యావరణ బాధ్యత, డిజిటల్ ఎకో సిస్టమ్‌లన్నీ బ్రిక్స్ లక్ష్యాలతో సారూప్యంగా ఉన్నాయన్నారు. భారత్ 2.18 లక్షల గ్రామాలకు భారత్ నెట్ ద్వారా కనెక్టివిటీ కల్పించడం, 95 శాతం జనాభాకు దేశీయ 4జీ టెక్నాలజీని అందించడం, కేవలం రెండేళ్లలో 4.70 లక్షల 5జీ సైట్లు ఏర్పాటు చేయడం, లోకల్ 5జీ ఉత్పత్తిని ప్రోత్సహించడం, అలాగే ప్రపంచంలోనే తక్కువ డేటా రేట్లు అందిస్తున్న అంశాలను ఈ సందర్భంగా పెమ్మసాని వివరించారు. సరైన స్పెక్ట్రం నిర్వహణ, బాధ్యతాయుతమైన స్పేస్ ట్రాఫిక్ నియంత్రణ కోసం బ్రిక్స్ దేశాల సహకారం అవసరమని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు.

# గుండెజబ్బుల ప్రమాదం పెంచుతున్న కరోనా..!

# చిన్నపాటి లక్షణాలు కూడా డేంజరే

కరోనా మహమ్మారి 2019 సంవత్సరంలో చైనాలో వెలుగులోకి వచ్చింది. తక్కువ సమయంలోనే ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. కొంతకాలంగా సైలెంట్ అయిన వైరస్.. ఇటీవల మళ్లీ విరుచుకుపడుతున్నది. మహమ్మారి వెలుగులోకి వచ్చినప్పటి నుంచి పలు అధ్యయనాలు కరోనా వైరస్ శ్వాసకోశ వ్యాధులకు కారణమైనప్పటికీ.. శరీరంలోని అనేక భాగాలపై దుష్ప్రభావం కలిగిస్తుందని తెలిపాయి. కరోనావైరస్ శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు నిర్వహించారు. ఇటీవలి ఓ అధ్యయనంలో కొవిడ్‌తో గుండె సంబంధిత సమస్యలతో మరణాలు వేగంగా పెరిగినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా గుండెపోటు, కార్డియాకరెస్ట్ కేసులు పెరిగాయని పలు నివేదికలు పేర్కొన్నాయి. వైరస్ వెలుగులోకి వచ్చాక గుండె సంబంధిత మరణాలు పెరిగినట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మసాచుసెట్స్‌లో మరణించిన దాదాపు 1.28లక్షల మంది మరణ ధ్రువీకరణపత్రాల డేటాను పరిశోధకుల బృందం విశ్లేషించి హెచ్చరికలు జారీ చేశారు. మహమ్మారి నుంచి 2020 నుంచి 2023 మధ్య గుండె సంబంధిత మరణాల రేటు గణనీయంగా ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగంలో ప్రొఫెసర్, రీసెర్చ్ డైరెక్టర్ జాసన్ హెచ్ వాస్ఫీ మాట్లాడుతూ కరోనా ఇన్ఫెక్షన్ గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేసిందని గత అధ్యయనాలు స్పష్టం చేశాయన్నారు. వైరస్ ప్రారంభం నుంచి గుండెపోటు, కార్డియాకరెస్ట్‌తో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు గుర్తించామన్నారు. మయోకార్డియల్ ఇన్ఫారక్షన్‌తో



కూడా హృదయ సంబంధ సమస్యల ప్రమాదం రెండు రెట్లు ఎక్కువగా ఉందని పరిశోధనలో తేలింది. కరోనావైరస్ కొంతమంది వ్యక్తులకు దీర్ఘకాలిక నష్టాన్ని కలిగిస్తున్నట్లు కనిపిస్తోందని పరిశోధకులు పేర్కొన్నారు. కరోనా ఇన్ఫెక్షన్ మన శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే విషయంపై అర్థం చేసుకునేందుకు

ఆసుపత్రిలో చేరే వారి సంఖ్య 20-34శాతం తగ్గిందని ఆసుపత్రి డేటా చూపిస్తుందని, అయితే గుండెపోటు మరణాలు పెరిగాయని.. మహమ్మారి సమయంలో ఇతర ఆరోగ్య సేవల్లో లోపాన్ని హైలెట్ చేస్తుందని అధ్యయనాలు పేర్కొన్నాయి. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఓ నివేదిక కోవిడ్-19 బాధిత వ్యక్తులు భవిష్యత్‌లో మూడేళ్ల తర్వాత ఎలాంటి లక్షణాలు కనిపించకపోయినా గుండెపోటు, స్ట్రోక్, అకాల మరణాలు సంభవించే ప్రమాదం రెండు రెట్లు ఎక్కువగా ఉంటుందని తెలిపింది. లాస్ ఏంజిల్స్‌లోని సదరన్ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో పబ్లిక్ హెల్త్ సైన్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ హూమన్ అల్లే మాట్లాడుతూ.. పాజిటివ్ పరీక్షించినప్పటికీ తీవ్రమైన లక్షణాలు కనిపించని వారికి

ప్రయత్నిస్తున్న శాస్త్రవేత్తల బృందం ఇటీవల అధ్యయనంలో ఓ షాకింగ్ విషయాన్ని వెల్లడించింది. గర్భదారణకు ముందు, గర్భదారణ సమయంలో కొవిడ్ ఇన్ఫెక్షన్ సంభవిస్తే.. గర్భం దాల్చిన 20వ వారానికి ముందు గర్భస్రావం అయ్యే ప్రమాదం రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని అధ్యయనంలో తేలింది. గర్భధారణ సమయంలో కరోనా ఇన్ఫెక్షన్ గర్భస్రావం అయ్యే ప్రమాదాన్ని పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయని అమెరికాలోని హ్యూస్టన్‌కు చెందిన ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ మైకేలా సాండోవల్ చెప్పారు. ఈ క్రమంలో మహిళలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు

**బెంగళూరు :** కన్నడ భాషపై తాను చేసిన కామెంట్స్‌పై వివాదం ముదురుతోన్న వేళ కమల్ హాసన్ తాజాగా స్పందించారు. కమల్ సారీ చెప్పాల్సిందేనంటూ వస్తోన్న డిమాండ్లు, హైకోర్టు కామెంట్స్ నేపథ్యంలో తాజాగా కర్ణాటక ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు లెటర్ రాశారు. తన వ్యాఖ్యలను అపార్థం చేసుకున్నారంటూ రాసుకొచ్చారు.రాజ్ కుమార్ కుటుంబంతో తనకు ఉన్న అనుబంధం గురించి మాట్లాడుతూ.. కన్నడ భాషపై తాను చేసిన కామెంట్స్‌ను అక్కడి వారు అపార్థం చేసుకోవడం బాధగా ఉందని కమల్ అన్నారు. తమిళం, కన్నడ ప్రజలు ఒకే ఫ్యామిలీ అని చెప్పడమే తన ఉద్దేశమని.. అంతే తప్ప ఏ భాషను తక్కువ చేయడం కాదంటూ లేఖలో పేర్కొన్నారు.ఒక భాష.. మరో భాషపై ఆధిపత్యం చెలాయించడాన్ని తాను వ్యతిరేకిస్తానని.. అన్నీ భాషలకు సమాన గౌరవం కోసం నిలుస్తానని కమల్ లెటర్‌లో పేర్కొన్నారు. 'తమిళంలాగే కన్నడ భాషకు సాంస్కృతిక నేపథ్యం ఉంది. దాన్ని నేను ఆరాధిస్తాను. కన్నడిగుల ఆదరణ నా కెరీర్ మొత్తం ఉంది. అందుకు నేను చాలా సంతోషిస్తున్నా. భాష పట్ల నా ప్రేమ నిజమైంది. కన్నడిగులు తమ మాతృభాషను ప్రేమించడాన్ని నేను గౌరవిస్తున్నా. తమిళం, కన్నడ, తెలుగు, మలయాళం ఇలా అన్నీ భాషలతోనూ నాకు ఎప్పటి నుంచే అనుబంధం ఉంది.నాకు సినిమా భాష తెలుసు. అది యూనివర్సల్ లాంగ్వేజ్. దానికి ప్రేమ, అనుబంధం మాత్రమే తెలుసు. అలా మన మధ్య ఉన్న బంధం గురించే మాట్లాడాను. ఈ ప్రేమ, బంధం గురించి నాకు నా సీనియర్లు చెప్పారు. ఆ ప్రేమ, అభిమానంతోనే శివరాజ్ కుమార్ (శివన్న) ఆడియో రిలీజ్ ఫంక్షన్‌కు హాజరయ్యారు. ఈ పరిణామాలతో ఆయన ఇబ్బందిపడడం విచారకరం. ఏది ఏమైనా మా మధ్య బంధం ఎప్పటికీ ఇలాగే ఉంటుంది. సినిమా.. ప్రజల మధ్య వారధిలాంటిది. అశాంతి, శత్రుత్వాన్ని నేను ఎప్పుడూ కోరుకోను.' అంటూ పేర్కొన్నారు.'థగ్ లైఫ్' ప్రీ రిలీజ్ వేడుకలో కమల్.. 'కన్నడ భాష తమిళం నుంచే పుట్టింది' అంటూ కామెంట్స్ చేశారు. దీనిపై అధికార, విపక్ష సభ్యులతో పాటు కన్నడిగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కమల్ సారీ చెప్పాలని.. లేకుంటే 'థగ్ లైఫ్' మూవీ రిలీజ్ అడ్డుకుంటామంటూ వార్నింగ్ ఇచ్చారు. మరోవైపు.. కమల్ సైతం ఈ విషయంపై వెనక్కి తగ్గలేదు. 'థగ్ లైఫ్' మూవీని బ్యాన్ చేయాలంటూ కేఎఫ్‌సీసీ తాజాగా కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేయగా విచారించిన న్యాయస్థానం కమల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరేమైనా భాషావేత్తనా?, చరిత్రకారుడా?.. ఒక్క 'సారీ' చెబితే ఇంత దూరం రాదు కదా? అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా కమల్ కేఎఫ్‌సీసీకి లేఖ రాశారు. ఎక్కడా సారీ చెప్పకపోయినా.. తన కామెంట్స్‌పై వివరణ ఇచ్చారు.

## ట్రంప్ ఫోన్ కాల్‌తో కాల్పుల విరమణ

భోపాల్: పహల్గాం దాడి అనంతరం పాకిస్థాన్ ఉగ్రమూకల పీచమణిచేందుకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు ప్రధాని నరేంద్ర మోదీ లొంగిపోయారని విమర్శించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన పార్టీ కన్వెన్షన్‌లో పాల్గొని రాహుల్ ప్రసంగించారు. "ఆపరేషన్ సిందూర్ ప్రారంభం కాగానే.. మోదీకి ట్రంప్ ఫోన్ చేశారు. మోదీజీ.. ఏం చేస్తున్నారని ఫోన్‌లో ట్రంప్ అడిగారు. నరేందర్ .. సరెండర్ అనగానే మోదీ కాల్పుల విరమణ ప్రకటించారు. ట్రంప్ ఆదేశాలను తూచా తప్పకుండా మోదీ పాటించారు " అని విమర్శించారు.

హనీమూన్‌కి వెళ్లిన జంట అదృశ్యం.. భర్త మృతదేహం గుర్తింపు

"అమెరికా బెదిరింపులను సైతం లెక్క చేయకుండా ఇందిరా గాంధీ హయాములో 1971లో పాకిస్థాన్‌ను భారత్ విచ్ఛిన్నం చేసింది. అగ్రరాజ్యాలకు కాంగ్రెస్ వ్యతిరేకంగా పోరాడింది. ఎప్పటికీ తలవంచదు. గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్.. వీరంతా అగ్రరాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధులే"అని అన్నారు.

## నైజీరియాలో జలవిలయం.. 700 మంది మృతి..!

**న్యూ డిల్లీ :** ;ఆఫ్రికా దేశం ను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఈ వర్షాల కారణంగా సంభవించిన వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. నైగర్ రాష్ట్రంలోని మోక్వా పట్టణంలో భారీ వరదలతో మరణించినవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. దాదాపు 700 వందల వరకూ ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా గురువారం ఉదయం అకస్మాత్తుగా కుండపోత వర్షం కురవడంతో దాదాపు ఐదు గంటల్లోనే భారీ వరద పట్టణాన్ని ముంచెత్తిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ వరదలకు ఇప్పటి వరకూ 200కి పైగా మృతదేహాలను గుర్తించారు. మరో 500 మంది ఆచూకీ గల్లంతైంది. వారంతా వరదల్లో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. గల్లంతైన వారిలో ఎవరూ సజీవంగా ఉండే అవకాశం లేనందున సహాయక చర్యలు నిలిపివేస్తున్నట్లు స్థానిక అధికారి మూసా కాంబోకు విలేకరులకు తెలిపారు.నైగర్ రాష్ట్రంలో వాణిజ్యపరంగా మోక్వా కీలక ప్రాంతం. ఇక్కడ భారీ ఎత్తున క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ముఖ్యంగా రైతులు తమ పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఇక్కడికి వస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతాన్ని అకస్మాత్తుగా వరదలు ముంచెత్తడంతో ప్రాణ నష్టం అధికంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పట్టణానికి రాకపోకలు సాగించే రెండు రోడ్లు, రెండు బ్రిడ్జీలు పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు. ఇక ఈ వదరలకు వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వందలాది ఇళ్లు కొట్టుకుపోయాయి. అనేక మంది గాయపడ్డారు.

## జీ7 నుంచి భారత్‌కు రాని ఆహ్వానం..

## ఆరేళ్లలో తొలిసారి!

**ఇంటర్నెట్ డెస్క్:** కెనడాలోని అల్బెర్టాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న జీ7 సదస్సుకు భారత్‌కు ఇంకా ఆహ్వానం అందలేదు. దీంతో ఆరేళ్లలో తొలిసారి ఈ సదస్సుకు ప్రధాని మోదీ దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. భారత్-పాక్‌ల మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి అమెరికాను అనుమతించిన తర్వాత ఇది మరో దౌత్యపరమైన భంగపాటేనని పేర్కొంది. కెనడాలో జరగనున్న జీ7 సదస్సులో పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధంతో పాటు ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లపైనా చర్చించే అవకాశం ఉంది. అయితే, ఈ సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశం లేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీకి ఇంకా ఆహ్వానం పంపలేదని తెలిసింది. ఒకవేళ ఆహ్వానం వచ్చినా.. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ అక్కడికి వెళ్లకపోవచ్చనే వాదన ఉంది. దీంతో జీ7లో ప్రధాని మోదీ పాల్గొనకపోవడం ఆరేళ్లలో తొలిసారి అవుతుంది.




ఇదే అంశంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్, ఇటలీ, కెనడాతోపాటు జర్మనీ అధినేతలు జీ7 సదస్సులో పాల్గొననున్నారని, వీరితోపాటు బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా దేశాధినేతలకు ఆహ్వానం అందిందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ వెల్లడించారు. 2014కు ముందుకు జీ8గా ఉండేదని, నాటి ప్రధాని మన్మోహన్‌కు అప్పట్లో ఆహ్వానం వచ్చేదన్నారు. 2014 తర్వాత ఈ సంప్రదాయం కొనసాగినప్పటికీ.. ఆరేళ్లలో తొలిసారి మన ప్రధానికి ఆహ్వానం అందలేదన్నారు. ఎలా చూసినా.. దౌత్యపరంగా ఇదో భంగపాటేనన్నారు.

ఇదిలాఉంటే, జీ7 దేశాల్లో భారత్ లేకున్నప్పటికీ.. నిర్వహణ దేశాల ఆహ్వానం మేరకు మన ప్రధాని ఆ శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొంటున్నారు. గతేడాది ఇటలీ వేదికగా జరిగిన సదస్సుకు భారత్‌తోపాటు ఆఫ్రికా, దక్షిణఅమెరికా, పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు పాల్గొన్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా పాల్గొని తన గళాన్ని వినిపించారు.



‘ఈ సాల కప్ నమ్దే..’ అవును.. ప్రతీ సీజన్‌ను ఇదే నినాదంతో హోరెత్తించే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు చివరకు సాధించింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 18 ఏళ్ల నిరీక్షణకు తెర దించుతూ ఈసారి కప్ కొట్టామంటూ బెంగళూరు ఫ్యాన్స్ దిక్కులు పిక్కటిల్లేలా సంబరాలు చేసుకున్నారు. ఐపీఎల్ మొదలు నుంచీ టైటిల్ కోసం చకోర పక్షిలా ఎదురుచూస్తున్న విరాట్ కోహ్లీ ఈ అద్భుత విజయంతో భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ ఫైనల్లో తమ బ్యాటర్లు పెద్దగా రాణించకపోయినా.. బౌలర్లు మాత్రం దుమ్మురేపడంతో ఆర్‌సీబీ తొలి టైటిల్‌తో మురిసిపోయింది. అటు క్వాలిఫయర్2లో కనిపించిన పంజాబ్ పరాక్రమం అసలైన మ్యాచ్‌లో లోపించింది. కెప్టెన్ శ్రేయాస్ కేవలం సింగిల్ రన్‌కే పరిమితం కావడం దెబ్బతీసింది. ఆఖరి ఓవర్‌లో శశాంక్ బ్యాట్ ఝుళిపించినా.. ఒక్క ‘సిక్సర్’ దూరంలోనే వీరికి టైటిల్ అందకుండా పోయింది.

## రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

# కల నెరవేరింది

### బెంగళూరుకు తొలి ఐపీఎల్ టైటిల్ ఫైనల్లో పంజాబ్ ఓటమి

### విజేత బెంగళూరుకు రూ. 20 కోట్లు రన్నరప్ పంజాబ్‌కు రూ. 12.5 కోట్లు



అహ్మదాబాద్: ఐపీఎల్ 18వ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కొత్త చాంపియన్‌గా నిలిచింది. మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్లో ఆర్‌సీబీ ఆరు పరుగుల తేడాతో నెగ్గింది. తద్వారా ఇన్నాళ్లూ ఊరిస్తున్న కప్పు కలను నెరవేర్చుకుంది. మరోవైపు క్రితంసారి కోల్‌కతాను విజేతగా నిలిపిన కెప్టెన్ శ్రేయాస్ ఈసారి చివరి మెట్టుపై బోల్తా పడ్డాడు.

మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులు చేసింది. విరాట్ (35 బంతుల్లో 3 ఫోర్లతో 43) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అర్ష్‌దీప్, జేమిసన్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 184 పరుగులు చేసి ఓడింది. శశాంక్ సింగ్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 61 నాటౌట్) పోరాడగా, ఇన్‌గ్లిస (23 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 39) ఫర్వాలేదనిపించాడు. క్రునాల్, భువనేశ్వర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా క్రునాల్ పాండ్యా నిలిచాడు.

**చేరువుగా వచ్చినా..:** ఓ మాదిరి ఛేదనలో పంజాబ్ ఆరంభం కూడా ధాటిగా ఏమీ సాగలేదు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి ఒత్తిడికి లోనైంది. కానీ ఆఖర్లో శశాంక్ మెరుపులు మెరిపించినా స్వల్ప తేడాతో ఓటమి పాలైంది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ (26), ప్రియాన్ష్ (24) బౌండరీల జోరుకు తొలి రెండు ఓవర్లలో 23 పరుగులతో మెరుపు ఆరంభమే దక్కింది. హాజెల్‌వుడ్ బరిలోకి దిగడంతో కష్టాలు ఆరంభమయ్యాయి. అతడి ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో ప్రియాన్ష్ రెండు ఫోర్లు బాదినా.. బౌండరీ లైన్ దగ్గర సాల్ట్ సమయస్ఫూర్తితో వ్యవహరించి క్యాచ్ పట్టేశాడు. తొలి వికెట్‌కు వీరు 43 పరుగులు జోడించారు. ఎనిమిదో ఓవర్‌లో ఇన్‌గ్లిస, ప్రభ్ చెరో సిక్సర్‌తో 15 రన్స్ వచ్చాయి. కానీ 9,10 ఓవర్లలో పంజాబ్‌కు గట్టి ఝలక్ తగిలింది. ముందుగా స్పిన్నర్ క్రునాల్.. ప్రభ్‌సిమ్రన్‌ను అవుట్ చేయగా, ఇక అత్యంత ప్రమాదకర కెప్టెన్ శ్రేయాస్ (1)ను షెఫర్డ్ పెవిలియన్‌కు చేర్చడం మలుపు తిప్పింది. దీంతో నరేంద్ర మోదీ స్టేడియంలో హోరు ఆకాశాన్నంటింది. ఇక మ్యాచ్ మనదే అనే భావన ఆర్‌సీబీ ఫ్యాన్స్‌తో పాటు ఆటగాళ్లలోనూ కనిపించింది. అయితే పంజాబ్ మాత్రం క్రీజులో చక్కగా కుదురుకున్న ఇన్‌గ్లిసపై ఆశలు పెట్టుకుంది. దీనికి తగ్గట్టుగానే అతడు క్రునాల్, షెఫర్డ్ ఓవర్లలో సిక్స్‌లతో ఆకట్టుకున్నాడు. అయితే ఈ సంబరం కూడా ఎక్కువ సేపు లేకుండా 13వ ఓవర్‌లో అతడిని క్రునాల్ అవుట్ చేశాడు. ఈ దశలో శశాంక్, నేహల్ (15) జోడీ ఐదో వికెట్‌కు 38 పరుగులు జోడించింది. 17వ ఓవర్‌లో నేహల్‌తో పాటు వచ్చీ రాగానే సిక్సర్ బాదిన స్టొయినిస్ (6)ను భువనేశ్వర్ పెవిలియన్‌కు చేర్చడంతో ఇక పంజాబ్ చేసేదేమీ లేకపోయింది. 6 బంతుల్లో 29 పరుగులు చేయాల్సి రాగా.. 6,4,6,6తో శశాంక్ 22 పరుగులతో ఓటమి తేడాను మాత్రమే తగ్గించగలిగాడు.

**కట్టడి చేశారు..:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌లో పెద్దగా మెరుపులు కనిపించలేదు. విరాట్ టాప్ స్కోరర్‌గా నిలిచినా అతడి ఆటలో వేగం లోపించింది. మిడిలార్డర్‌లో రజత్, జితేశ్, లివింగ్‌స్టోన్ ఎదురుదాడి ప్రయత్నం కాసేపే అయ్యింది. పంజాబ్ బౌలర్ల విజృంభణకు డెత్ ఓవర్లలో 45 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన ఆర్‌సీబీ స్కోరు 200లోపే ముగిసింది. తొలి ఓవర్‌లోనే 6,4 బాదిన ఓపెనర్ సాల్ట్ (16) రెండో ఓవర్‌లో శ్రేయాస్ సూపర్ క్యాచ్‌కు వెనుదిరిగాడు. ఆ తర్వాత పవర్‌ప్లేలో మయాంక్ (24) వేగం చూపడంతో స్కోరు 55/1తో నిలిచింది. చాహల్ తన తొలి ఓవర్‌లోనే మయాంక్‌ను అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 38 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ఆర్‌సీబీ తొలి పది ఓవర్లలో 18 డాట్ బాల్స్ ఆడగా, విరాట్ బ్యాట్ నుంచి రెండు ఫోర్లు మాత్రమే రావడం గమనార్హం. ఉన్నకాసేపు కెప్టెన్ రజత్ పటీదార్ (26) రెండు సిక్సర్లతో వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. 11వ ఓవర్‌లో అతడిని జేమిసన్ ఎల్బీ చేయడంతో మూడో వికెట్‌కు 40 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం చాహల్, వైశాక్ కట్టడి చేయడంతో ఆర్‌సీబీ రన్స్ కోసం ఇబ్బందిపడింది. చివరకు 14వ ఓవర్‌లో లివింగ్‌స్టోన్ 6, విరాట్ 4తో 14 రన్స్ సమకూరాయి. అయితే సహజశైలిలో భారీషాట్లు ఆడలేకపోయిన కోహ్లీ పుల్‌షాట్ ఆడే ప్రయత్నంలో అజ్మతుల్లాకు రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. ఈ దశలో వచ్చిన జితేశ్ 16వ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో ఆకట్టుకున్నాడు. తర్వాతి ఓవర్‌లో 2 సిక్సర్లతో అదుర్స్ అనిపించాడు. జేమిసన్ ఈ ఓవర్‌లో 23 పరుగులిచ్చుకున్నా లివింగ్‌స్టోన్ (25) వికెట్ తీయగలిగాడు. ఈ జోడీ మధ్య ఐదో వికెట్‌కు 12 బంతుల్లోనే 36 పరుగులు జత చేరాయి. అటు చక్కటి టచ్‌లో కనిపించిన జితేశ్‌ను పేసర్ వైశాక్ బౌల్డ్ చేయగా.. 19వ ఓవర్‌లో షెఫర్డ్ 4,6తో 14 రన్స్ అందించాడు. గతంలో చెన్నైపై అతడి హిట్టింగ్‌ను చూసిన ఫ్యాన్స్..ఈసారి కూడా భారీస్కోరు చేస్తాడని భావించారు. అయితే అర్ష్‌దీప్ ఆఖరి ఓవర్‌లో 3 పరుగులే ఇచ్చి షెఫర్డ్ (17), క్రునాల్ (4), భువనేశ్వర్ (1)ల వికెట్లతో వహ్వా.. అనిపించాడు.






## విరాట్.. ఏడ్చేశాడు

ఆధునిక క్రికెట్‌లో అత్యున్నత ఆటగాడైనా తన కెరీర్‌లో ఇప్పటి దాకా ఐపీఎల్ టైటిల్ లేని లోటు విరాట్ కోహ్లీని వేధిస్తూనే వచ్చింది. అందుకే సుదీర్ఘ విరామం తర్వాత చాంపియన్‌గా నిలిచామనే వాస్తవాన్ని కోహ్లీ కూడా కాసేపు నమ్మలేకపోయాడేమో.. ఆఖరి ఓవర్‌లో రెండో బంతి ముగియగానే భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయాడు. అప్పటికి 4 బంతుల్లో 29 రన్స్ అవసరమవడంతో ఆర్‌సీబీ గెలుపు ఖాయమైంది. దీంతో విరాట్ తన ముఖాన్ని రెండు చేతుల్లో దాచుకుంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. మైదానంలోకి వచ్చిన భార్య అనుష్కను కౌగిలించుకుని చాలా సేపు అలాగే ఉండిపోయాడు. ఇదిలావుండగా.. తమ అభిమాన క్రికెటర్ కోహ్లీ జెర్సీ నెంబర్ 18 కావడం.. అటు అతనికి ఐపీఎల్ టైటిల్ కూడా 18వ సీజన్‌లోనే దక్కడం అభిమానులకు మరింత ఆనందాన్నిస్తోంది.

## ఈ సీజన్ హీరోలు

ఆరెంజ్ క్యాప్: సాయి సుదర్శన్
(15 మ్యాచ్‌ల్లో 759 పరుగులు, గుజరాత్)
పర్పుల్ క్యాప్: ప్రసిద్ధ్ కృష్ణ
(15 మ్యాచ్‌ల్లో 25 వికెట్లు, గుజరాత్)
అత్యంత విలువైన ఆటగాడు -సూర్యకుమార్
ఉత్తమ వర్ధమాన ఆటగాడు- సాయి సుదర్శన్
ఫెయిర్ ప్లే- చెన్నై సూపర్ కింగ్స్
ఉత్తమ పిచ్ అవార్డు- ఢిల్లీ క్యాపిటల్స్
అరంగేట్ర సీజన్‌లో ఎక్కువ పరుగులు (475) చేసిన అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా ప్రియాన్ష్ ఆర్య




## స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (సి) శ్రేయాస్ (బి) జేమిసన్ 16, విరాట్ కోహ్లీ (సి అండ్ బి) ఒమర్జాయ్ 43, మయాంక్ అగర్వాల్ (సి) అర్ష్‌దీప్ (బి) చాహల్ 24, పటీదార్ (ఎల్బీ) జేమిసన్ 26, లివింగ్‌స్టోన్ (ఎల్బీ) జేమిసన్ 25, జితేశ్ (బి) వైశాక్ 24, షెఫర్డ్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 17, క్రునాల్ పాండ్యా (సి) శ్రేయాస్ (బి) అర్ష్‌దీప్ 4, భువనేశ్వర్ (సి) ప్రియాన్ష్ (బి) అర్ష్‌దీప్ 1, యశ్ దయాల్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 9బీ మొత్తం: 20 ఓవర్లలో 190/9బీ వికెట్ల పతనం: 1-18, 2-56, 3-96, 4-131, 5-167, 6-171, 7-188, 9-189, 9-190బీ బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-40-3, జేమిసన్ 4-0-48-3, ఒమర్జాయ్ 4-0-35-1, వైశాక్ 4-0-30-1, చాహల్ 4-0-37-1.

పంజాబ్: ప్రియాన్ష్ (సి) సాల్ట్ (బి) హాజెల్‌వుడ్ 24, ప్రభ్‌సిమ్రన్ (సి) భువనేశ్వర్ (బి) క్రునాల్ 26, ఇన్‌గ్లిస్ (సి) లివింగ్‌స్టోన్ (బి) క్రునాల్ 39, శ్రేయాస్ (సి) జితేశ్ (బి) షెఫర్డ్ 1, నేహల్ (సి) క్రునాల్ (బి) భువనేశ్వర్ 15, శశాంక్ సింగ్ (నాటౌట్) 61, స్టొయినిస్ (సి) యశ్ (బి) భువనేశ్వర్ 6, ఒమర్జాయ్ (సి/సబ్) భండగె (బి) యశ్ దయాల్ 1, జేమిసన్ (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు 11బీ మొత్తం: 20 ఓవర్లలో 184/7బీ వికెట్ల పతనం: 1-43, 2-72, 3-79, 4-98, 5-136, 6-142, 7-145బీ బౌలింగ్: భువనేశ్వర్ 4-0-38-2, యశ్ దయాల్ 3-0-18-1, హాజెల్‌వుడ్ 4-0-54-1, క్రునాల్ 4-0-17-2, సుయాశ్ 2-0-19-0, షెఫర్డ్ 3-0-30-1.

# ఆసక్తికరంగా 'రానా నాయుడు: సీజన్ 2' ట్రైలర్




విక్టరీ వెంకటేశ్, రానా ప్రధాన పాత్రలలో రూపొందిన వెబ్ సిరీస్ రానా నాయుడు. మొదటి సీజన్ యువతను బాగా ఆకట్టుకోవడంతో ఇప్పుడు కొనసాగింపుగా 'రానా నాయుడు: సీజన్ 2' వస్తోంది. దీని కోసం అభిమానులు అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో రానా నాయుడు సీజన్ 2కి సంబంధించిన ట్రైలర్ తాజాగా విడుదలైంది.

ఇందులో వినోదం, థ్రిల్లింగ్ అంశాలు అంచనాలని పెంచేశాయి. 'రానా నాయుడు: సీజన్ 2'లో నాగ నాయుడుగా వెంకటేశ్ సందడి చేయనున్నారు. 'రానా నాయుడు: సీజన్ 2' మొత్తం యాక్షన్, డ్రామాతో నిండి ఉంటుంది. ఇది జూన్ 13 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

తొలి పార్ట్‌లో కాస్త బోల్డ్ కంటెంట్ ఉందని విమర్శలు వచ్చిన నేపథ్యంలో సీక్వెల్‌లో కాస్త దానిని తగ్గించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషలలో ఇది విడుదల కానుంది. అర్జున్ రాంపాల్, సుర్వీన్ చావ్లా, కృతి కర్బంద, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, డినోమోరియా తదతరులు ఇందులో కీలక పాత్రలు పోషించారు.కాగా, రియల్ లైఫ్ లో బాబాయి, అబ్బాయిలు ఈ వెబ్ సిరీస్ లో తండ్రి తనయులుగా నటించిన విషయం తెలిసిందే. ఈ క్రేజీ సిరీస్‌ని కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ వర్మ, అభయ్ చోప్రా తెరకెక్కించగా... సుందర్ ఆరోన్, లోకోమోటివ్ గ్లోబల్ మీడియా నిర్మించింది.

# జూన్ రెండో వారం నుంచి 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై దర్శకుడు హరీశ్ శంకర్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఆయన మంగళవారం ఉదయం వీఐపీ విరామం సమయంలో దర్శించుకున్నారు. స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో హరీశ్ శంకర్ మాట్లాడారు. జూన్ రెండవ వారంలో 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని తెలియజేశారు. సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు స్వామివారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చామని ఆయన తెలియజేయడంతో పవన్ అభిమానుల ఆనందానికి అవధులు లేవు. గతంలో పవన్ కల్యాణ్‌తో 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ అందించిన హరీశ్, ఈ సినిమాతో మరోసారి ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. తాజా షెడ్యూల్ సుమారు నెల రోజుల పాటు కొనసాగుతుందని సమాచారం. ఈ షెడ్యూల్‌లో పవన్ కల్యాణ్, శ్రీలీలపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. నిర్మాణ వర్గాల సమాచారం ప్రకారం షెడ్యూల్ ప్రారంభమైన ఒకట్రెండు రోజుల్లో పవన్ షూటింగ్‌లో పాల్గొంటారని తెలుస్తోంది. కొంతకాలంగా 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రాజెక్ట్ ఆగిపోయిందంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, హనుమాన్ జయంతి సందర్భంగా చిత్ర బృందం ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఆ పోస్టర్‌లో పవన్ హనుమంతుడి లాకెట్ ధరించి, దర్శకుడు హరీశ్ శంకర్ చేతిని పట్టుకుని ఉన్న దృశ్యం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ పోస్టర్‌తో సినిమా ఆగిపోలేదని, త్వరలోనే చిత్రీకరణ మొదలవుతుందని స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు.మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. తొలుత ఈ సినిమాను 2025 దీపావళికి విడుదల చేయాలని భావించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం 2026లో థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.కాగా, పవన్ ప్రస్తుతం ముంబైలో 'ఓజీ' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇప్పటికే ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను మేకర్స్ కూడా ప్రకటించారు. సెప్టెంబర్ 25న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ఇటీవలే పోస్టర్ ద్వారా తెలియజేశారు. ఇక, పవర్‌స్టార్ నటించిన మరో భారీ చిత్రం 'హరిహర వీరమల్లు- పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# గ్లామరస్ గా నటిస్తే తప్పేంటటి



సినిమాల్లో గ్లామరస్ గా నటిస్తే తప్పేంటని మలయాళ నటి మాళవిక మీనన్ ఎదురు ప్రశ్నిస్తోంది. ఇటీవల సోషల్ మీడియాలో గ్లామరస్ ఫొటోలు షేర్ చేస్తూ యువతకు నిద్ర లేకుండా చేస్తున్న మాళవిక.. తనపై నెగెటివ్ ప్రచారం చేసే వారిని పట్టించుకోనని చెప్పింది. ఎక్స్ పోజింగ్ విషయంలో చాలామంది హీరోయిన్లు ఉదారంగా ఉంటున్నారని తెలిపింది. తాను ఒక్కదాన్నే గ్లామర్ గా నటించడంలేదని, మిగతా హీరోయిన్లు కూడా బాడీ షో చేస్తున్నారని గుర్తుచేసింది. తమిళ, మలయాళ భాషల్లో చిత్రాలతో బిజీగా ఉన్న మాళవిక కోలీవుడ్‌లోనూ అవకాశాలు అందిపుచ్చుకుంటోంది. తెలుగులో 'అమ్మాయిలు అంతే అదో టైపు', 'వందనం' వంటి చిత్రాల్లో నటించినా పెద్దగా ఫేమ్ రాలేదు. దీంతో, ఓవైపు తెలుగు ఇండస్ట్రీలో అవకాశాల కోసం ప్రయత్నిస్తూనే మలయాళ ఇండస్ట్రీపై మాళవిక ఫోకస్ పెట్టింది. తన ఇన్‌స్టాలో మాళవిక షేర్ చేస్తున్న ఫొటోలు వైరల్ గా మారుతున్నాయి. ఈ ఫొటోలు చూసి నెటిజన్లు నటిపై ఫైర్ అవుతున్నారు. అవకాశాల కోసమే ఇలా ఎక్స్ పోజ్ చేస్తున్న ఫొటోలను షేర్ చేస్తోందని కామెంట్లు పెడుతున్నారు. ఈ కామెంట్లపై మాళవిక తాజా ఇంటర్వ్యూలో స్పందించింది. 'అవకాశాల కోసమే ఫొటోలు షేర్ చేయడం లేదు. అయినా గ్లామర్‌గా నటించడంలో తప్పేముంది. నా గురించి ఉన్నవీ లేనివీ ప్రచారం చేసే వారి గురించి పట్టించుకోవాల్సిన అవసరం నాకు లేదు. నాలాగే చాలామంది హీరోయిన్లు గ్లామర్ పాత్రల్లో నటిస్తున్నారు" అని చెప్పుకొచ్చింది.



# మీ సినిమాలంటే నాకెంతో ఇష్టం

## : శేఖర్ కమ్ములపై చిరు

ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల ఇండస్ట్రీలోకి వచ్చిన ఇటీవలే 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. మెగాస్టార్ చిరంజీవి సమక్షంలో ఈ వేడుకలు జరిగాయి. తన అభిమాన నటుడి సమక్షంలో ఈ వేడుకలు జరగడంతో శేఖర్ కమ్ముల ఎంతో సంతోషించారు. తాజాగా మెగాస్టార్ చిరంజీవి శేఖర్ కమ్ములపై సోషల్‌మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపించారు.శేఖర్ కమ్ములతో దిగిన ఫోటోలను పోస్ట్ చేసిన చిరు "మై డియర్ శేఖర్, మీలాంటి ఒక అభిమాని వుండటం నాకూ అంతే ఆనందకరం. మీ ప్రస్థానానికి స్ఫూర్తి నిచ్చానని తెలిసి మరింత సంతోషించాను. మీ 25 సంవత్సరాల జర్నీలో ఆ విధంగా నేనూ ఒక భాగమైనందుకు గర్వంగా వుంది. సున్నితమైన వినోదంతో పాటు, ఒక సోషల్ కామెంట్‌ని జత చేసి ఆలోచనాత్మకంగా తీసే మీ సినిమాలంటే నాకు ఎంతో ఇష్టం. ఫిలిం మేకింగ్‌లో మీకంటూ ఒక ప్రత్యేక శైలిని క్రియేట్ చేసుకున్న మీరు ఇలాగే మరో 25 ఏళ్ళు మరెన్నో జనరంజకమైన సినిమాలు 'రాస్తూ', తీస్తూ, మరెన్నో ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, ఆశీర్వదిస్తున్నాను" అని రాసుకొచ్చారు.ఇక సినిమాల విషయానికొస్తే.. చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర' అనే సినిమా చేస్తుండగా.. శేఖర్ కమ్ముల నాగార్జున, ధనుష్‌ల కాంబినేషన్‌లో 'కుబేరా' అనే సినిమా చేస్తున్నారు.

### ఈ నెల 6న అక్కినేని అఖిల్ వివాహం

# చంద్రబాబుకు వివాహ ఆహ్వాన పత్రికను అందించిన నాగార్జున





ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సినీ నటుడు అక్కినేని నాగార్జున ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎంను నాగార్జున కలిశారు. తన కుమారుడు, యువ హీరో అక్కినేని అఖిల్ వివాహానికి హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆయన వ్యక్తిగతంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వివాహ ఆహ్వాన పత్రికను చంద్రబాబుకు నాగార్జున అందజేశారు.ప్రస్తుతం అక్కినేని కుటుంబంలో పెళ్లి సందడి నెలకొంది. అఖిల్ వివాహం ఈ నెల 6వ తేదీన జరగనున్న నేపథ్యంలో, నాగార్జున ప్రముఖులను స్వయంగా కలిసి వివాహ వేడుకకు ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన ఈరోజు ఉండవల్లికి విచ్చేసి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఇరువురు కాసేపు వివిధ అంశాలపై మాట్లాడుకున్నట్లు సమాచారం.



### చిరంజీవి సినిమా ప్రమోషన్స్‌పై ట్రోల్స్

# : ఘాటుగా స్పందించిన నయనతార

స్టార్ హీరోయిన్ నయనతార ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇద్దరు పిల్లల తల్లి అయినప్పటికీ, తెలుగు, తమిళంతో పాటు ఇతర భాషల్లోనూ చిత్రాలు చేస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నారు. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా అందరు హీరోలతోనూ నటిస్తున్నారు. తాజాగా, మెగాస్టార్ చిరంజీవి సరసన, దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రంలో నటించనున్నారు.సాధారణంగా తన సినిమా ప్రమోషన్ కార్యక్రమాలకు దూరంగా ఉండే నయనతార, ఈ చిత్రానికి మాత్రం షూటింగ్ ప్రారంభానికి ముందే ప్రచారం మొదలుపెట్టడం చర్చనీయాంశమైంది. ఇటీవల దర్శకుడు అనిల్ రావిపూడి చెన్నై వెళ్లి ఆమెతో ఒక ప్రమోషన్ వీడియో చిత్రీకరించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే, తమిళ సినిమా ప్రమోషన్లలో పెద్దగా కనిపించని నయనతార, తెలుగు సినిమా కోసం ఇంత ముందుగా ప్రచారం చేయడంపై కొందరు తమిళ నెటిజన్లు ట్రోల్స్ ప్రారంభించారు. "తెలుగు సినిమాలపై అంత ఇష్టమా? అయితే టాలీవుడ్‌కే షిఫ్ట్ అవ్వొచ్చు కదా?" అంటూ విమర్శలు గుప్పించారు.ఈ ట్రోల్స్‌పై నయనతార తనదైన శైలిలో స్పందించారు. "అనవసర విషయాలకు సమయం వృథా చేసుకోవడం నాకు ఇష్టం ఉండదు. నా వీలును బట్టి నిర్మాతలకు సహకరిస్తూనే ఉంటాను. ప్రమోషన్లకు వెళ్లాలా, వద్దా అన్నది కూడా నా వ్యక్తిగత విషయం. ఈ విషయంలో ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు" అని ఆమె ఘాటుగా బదులిచ్చారు. కాగా, గతంలో చిరంజీవితో నయనతార రెండు చిత్రాల్లో నటించగా, ఇప్పుడు మూడోసారి మెగాస్టార్ సరసన నటిస్తోంది.

# 'స్పిరిట్' వివాదం.. దీపికాకు అండగా నిలిచిన ప్రముఖ దర్శకుడు మణిరత్నం





బాలీవుడ్ నటి దీపికా పదుకొణె, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'స్పిరిట్' సినిమాకు సంబంధించి నెలకొన్న వివాదంపై సీనియర్ దర్శకుడు మణిరత్నం స్పందించారు. దీపికా కొన్ని షరతులు విధించారని, వాటిలో భాగంగా రోజుకు 8 గంటలు మాత్రమే పనిచేస్తానని, రూ.20 కోట్ల పారితోషికంతో పాటు లాభాల్లో వాటా కావాలని, తెలుగులో డైలాగులు చెప్పనని కోరినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాక, ఆమె స్థానంలో యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రీని తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ వివాదంపై మణిరత్నం మాట్లాడుతూ దీపికా డిమాండ్లను గట్టిగా సమర్థించారు. న్యూస్ 18కి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మణిరత్నం మాట్లాడుతూ... "ఆమె డిమాండ్లు పూర్తిగా సరైనవని నేను భావిస్తున్నాను. అలాంటి డిమాండ్లు చేసే స్థాయిలో ఆమె ఉన్నందుకు సంతోషంగా ఉంది. ఒక చిత్ర నిర్మాతగా, నటీనటులను ఎంపిక చేసేటప్పుడు ఇలాంటి విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. చిత్ర పరిశ్రమలో వృత్తిపరమైన సరిహద్దులు ఉండాలి. ఫిల్మ్‌మేకర్స్ అలాంటి అవసరాలను గుర్తించి, అర్థం చేసుకుని, వాటికి అనుగుణంగా పనిచేయాలి" అని తెలిపారు. దీపికా విషయంలో మణిరత్నం చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. గతంలో నటులు అజయ్ దేవగణ్ , సైఫ్ అలీ ఖాన్ కూడా దీపికా వైఖరికి మద్దతు పలికిన విషయం తెలిసిందే.